Sweken IT Solutions
WE ARE HIRING !!
POWER BI SPECIALIST
DATA ANALYST
INTERESTED CANDITATES
PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేఖరులు కావలెను
విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలకు విలేఖరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్: 7013785256, 9959867303

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 137 విశాఖపట్నం, 9 మార్చి 2025 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

# ఆదరాభిమానాల్లో అత్యంత ధనవంతుడిని

## నవ్‌సరి సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



**నవ్‌సరి :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటనలో ఉన్నారు. ఇక్కడ ఆయన నవ్‌సరిలోని లఖ్‌పతి సోదరీమణులతో సమావేశమయ్యారు. నవ్‌సరిలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, 'నా జీవితంలో కోట్లాది మంది తల్లులు, సోదరీమణుల ఆశీస్సులు, ఆదరాభిమానాలు ఉన్నాయి, నేను ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిని. అభివృద్ధి చెందిన భారతదేశం వైపు మహిళలను గౌరవించడం తొలి అడుగు అని ఆయన అన్నారు. ప్రధాని మోదీ ఇక్కడ ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. దీనికి ముందు, అతను ఓపెన్ జీప్‌లో హెలి ప్యాడ్ నుండి దాదాపు 700 మీటర్ల రోడ్ షో చేయడం ద్వారా వేదిక వద్దకు చేరుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకే మహిళా పోలీసు సిబ్బందిని మాత్రమే భద్రతా సిబ్బందిగా నియమించారు. ఇది దేశంలోనే తొలి సారిగా జరుగుతోంది.ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిని అని గర్వంగా చెప్పుకోగలను అని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. నా జీవిత ఖాతాలో కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు, కుమార్తెల ఆశీర్వాదాలు ఉన్నా యి. ఈ ఆశీర్వాదాలు నిరంతరం పెరుగుతున్నాయి. అందుకే ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిని అని చెబుతున్నానని ప్రధాని స్పష్టం చేశారు. బహిరంగ సభలో ప్రసంగిస్తూ ప్రధాని మోదీ, మహిళా దినోత్సవం, మాతృభూమి గుజరాత్‌లో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రత్యేక రోజున ఇంత పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై, వారి ప్రేమ, ఆప్యాయత, ఆశీర్వాదాలకు నేను మాతృశక్తికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని మోదీ అన్నారు. గుజరాత్ సఫల్ –గుజరాత్ మైత్రి అనే రెండు పథకాలను ప్రధాని మోదీ ఇక్కడి నుంచి ప్రారంభించారు. అనేక పథకాల నుండి డబ్బును నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడం జరిగింది. దీనికి అభినందనలు తెలిపిన ప్రధాని మహిళలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.నేడు భారతదేశం మహిళల నేతృత్వంలోని అభివృద్ధి మార్గంలో పయనించిందని ఆయన అన్నారు. మా ప్రభుత్వం (మిగతా 2లో)



# నిప్పుల కొలిమి

## తెలుగు రాష్ట్రాల్లో దారెత్తిస్తున్న ఎండలు

## వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి

**అమరావతి (విశాఖ సమాచారమ్) :** ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే ఎండలు దారెత్తిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు అవుతుండగా.. కొన్ని ప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రతీ రోజు ఉష్ణోగ్రతలు పెరిగిపోతూనే ఉన్నాయి. ఈ క్రమంలో వాతావారణ శాఖ కీలక ప్రకటన చేసింది. 36 నుంచి 40 డిగ్రీల మధ్య పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. అయితే.. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 3 రోజులు వాతావరణ పరిస్థితులు ఎలా ఉండనున్నాయో వాతావరణ శాఖ వెల్లడించింది.

ఆంధ్రప్రదేశ్ యానాంలో ఆగ్నేయ, నైరుతి గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఈ కింది విధంగా ఉన్నాయి..

**ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం :** శనివారం, ఆదివారం, సోమవారం (మిగతా 2లో)

# చైనా, పాక్ నుంచి యుద్ధం ముప్పు : ఆర్మీ చీఫ్



**ఢిల్లీ :** చైనా, పాకిస్థాన్‌ను ఉద్దేశించి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ రెండింటి మధ్య ఉన్న కుట్రపూరిత సంబంధాలను భారత్ తప్పక అంగీకరించాలన్నారు.ఈమేరకు ఒక జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. 'వర్చువల్ డొమైన్‌లో ఆ రెండు దేశాల మధ్య బంధం వందశాతంగా ఉంది. భౌతికంగా పరిశీలిస్తే.. చైనాలో తయారైన మిలిటరీ ఉత్పత్తులను పాక్ వినియోగిస్తోంది. రెండువైపుల నుంచి యుద్ధ ముప్పు ఉందనేది వాస్తవం. అలాగే వేసవి సమీపిస్తున్నకొద్దీ జమ్మూ కశ్మీర్‌లో చొరబాట్లు పెరిగే అవకాశం ఉంది. సరిహద్దుల వెంబడి చొరబాట్లు తగ్గే సూచనలు కనిపించడం లేదు. ఉగ్రవాదుల కదలికలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది' అని ద్వివేది వెల్లడించారు. ఇక, ఉగ్రవాద కట్టడికి భారత సైన్యం గట్టి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈవిషయంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలిపారు. 2018 నుంచి ఉగ్రవాద ఘటనల సంఖ్య 83 శాతం తగ్గాయన్నారు. కేవలం 45 మంది మాత్రమే ఉగ్ర కార్యకలాపాల వైపు ఆకర్షితులయ్యారని చెప్పారు.సైన్యం చర్యలతో పర్యటకం పెరిగిందన్నారు.

# మీ గౌరవాన్ని మరింత పెంచుతా..

## మహిళా దినోత్సవంలో సీఎం చంద్రబాబు



**ప్రకాశం :** ఆడబిడ్డలు అభివృద్ధిలో భాగస్వామ్యం కాకపోతే చులకనగా చూసే అవకాశం ఉంటుందని.. ఆర్థికంగా సమాజంలో పైకి వచ్చేందుకు, ఆడబిడ్డల గౌరవం పెంచేందుకు డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మార్కాపురంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో సీఎం మాట్లాడుతూ.. పొదుపు ఉద్యమంతో ప్రారంభించానన్నారు. గతంలో ఎన్నో మీటింగ్‌లు పెట్టి మహిళలతో మాట్లాడేవాడినని చెప్పారు. పొదుపు వల్ల మహిళలు.. తమ పిల్లలను చదివించుకుంటున్నారని, చిన్న వ్యాపారాలు పెట్టుకుంటున్నారన్నారు. మహిళల గౌరవం పెరిగిందన్నారు. ఇంట్లో వారు మహిళలను గౌరవిస్తున్నారంటే ఆనాడు తాను ఆలోచించిన విధానమే కారణమన్నారు. మహిళలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తానన్నారు. మహిళలు తమ ఊర్లోనే కూర్చుని డబ్బులు సంపాదించే విధానానికి శ్రీకారం చుడతానన్నారు.డ్వాక్రా సంఘాలు, మెప్మా సంఘాల వారికి మెరుగైన జీవన ప్రమాణాలు ఇచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. అందుకు మహిళలు సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ఆడబిడ్డల కష్టం తీర్చేందుకు దీపం పథకం తీసుకొచ్చామన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తులుగా తయారు చేస్తామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత తమదన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్**

'నా కుటుంబంతో పాటు వ్యాపారంలో భువనేశ్వరి పాత్ర కీలకం. హెరిటేజ్ సంస్థని భువనేశ్వరి డెవలప్ చేశారు. నా తల్లి పడిన ఇబ్బందులు మహిళలు పడకూడదనే దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశా. ఆడబిడ్డల భద్రత కోసం ప్రత్యేకంగా యాప్ తీసుకువచ్చాం. ఆడబిడ్డల జోలికొస్తే ఖబడ్దార్. అదే మీకు చివరి రోజు అవుతుంది. గంజాయి, డ్రగ్స్ తాగి ఆడబిడ్డల జోలికి వస్తే వదిలిపెట్టం. గత ఐదేళ్లు మహిళలు స్వేచ్ఛగా మాట్లాడిన పరిస్థితి లేదు. మహిళలను బలవంతంగా మీటింగ్‌కు తీసుకువచ్చి బయటకు వెళ్ళకుండా చుట్టూ గుంటలు తీసేవాళ్ళు. మహిళలు ఇంటి నుంచి పని చేసేందుకు గ్రామాల్లో వర్క్ స్టేషన్లు పెడతాం. కంపెనీలు తీసుకువచ్చే (మిగతా 2లో)

# చిట్టితల్లీ.. తల్లడిల్లి

## కౌమార దశలో తప్పటడుగులతో ఇబ్బందులు

## బాలికలతో పాటు తల్లిదండ్రులకూ కౌన్సెలింగ్ అవసరం



**అల్లూరి జిల్లా, విశాఖ సమాచారమ్:** అరకులోయ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలిక అదే గ్రామానికి చెందిన యువకుడితో ప్రేమలో పడింది. ఇద్దరూ వివాహం చేసు కుందామనుకున్నారు. ఇంతలోనే బాలిక గర్భం దాల్చింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఐసీడీఎస్ అధికారుల సాయంతో న్యాయస్థానం అనుమతితో గర్భాన్ని తీయించా రు. అరకులోయ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు 14 ఏళ్ల వయసులోనే ఇటీ వల తల్లిదండ్రులు బంధువుల యువకుడితో వివాహం జరిపించారు. ఈ విషయం తెలుసుకు న్న ఐసీడీఎస్ అధికారులు బాలిక, యువకుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇద్దరూ మేజర్లు అయ్యాక కలిసి ఉండాలని ఒప్పించారు. వారం రోజుల తర్వాత యువకుడి ఇంటికి కాపురానికి బాలిక వెళ్లిపోయింది. అల్లూరి జిల్లాలో ఇటువంటి ఘటనలు కోకొల్లలు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండానే వివాహం చేస్తున్నారు. తెలిసీ తెలియని వయసులో ఆకర్షణలకు (మిగతా 2లో)





వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి దోలా బాల వీరాంజనేయ స్వామి, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, ఇతర అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు.

- వార్త 8వ పేజీలో..

శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు

# సర్వం సిద్ధం



**తిరుమల (విశాఖ సమాచారమ్) :** శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మార్చి 9వ తేదీ రాత్రి 7 గంటలకు తెప్పోత్సవాలు ప్రారంభమవుతాయి. 13వ తేది వరకు రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో ఆనందవిహారం చేస్తారు. ఏటా ఫాల్గుణ మాసంలో శుద్ధ ఏకాదశినాడు ప్రారంభమయ్యే (మిగతా 2లో)




# మోదీ అకౌంట్ ఈమె చేతుల్లోనే..

**ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా అకౌంట్ బాధ్యతల్ని ఓ యువతి చూసుకుంటున్నారు.ఆయన ట్విట్టర్ ఖాతాలో పోస్టింగ్స్ రెస్పాన్సిబిలిటీని చూసు కుంటున్న ఆ యువతి వయసు 23 ఏళ్లు మాత్రమే. వణక్కం అంటూ ఆమె పెట్టిన పోస్టులు ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. కలల్ని కనడం, వాటిని సాకారం చేసుకోవడం కోసం అలుపెర గకుండా ప్రయాణం సాగించాలంటూ ఆమె ఇస్తున్న సందేశాలు అందర్నీ ఆలోచింపజేస్తున్నాయి. మరి.. ఎవరా యువతి.. ప్రధాని ఖాతాను ఆమె ఎందుకు హ్యాండిల్ చేస్తున్నారో తెలుసు కుందాం..

శనివారం మహిళా దినోత్సవం కావడంతో నారీశక్తికి వందనం అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు ప్రధాని మోదీ. ఈ క్రమంలోనే ఆయన ఓ అరుదైన నిర్ణయం తీసుకున్నారు. తన సోషల్ మీడియా అకౌంట్లను హ్యాండిల్ చేసే బాధ్యతల్ని ఎంపిక చేసిన కొందరు స్త్రీలకు ఆయన అప్పజెప్పారు. ఈ తరుణంలోనే మోదీ ఖాతా నుంచి వణక్కం.. అంటూ ఓ పోస్ట్ వచ్చింది. ఆయన అకౌంట్ నుంచి పోస్ట్ పెట్టిన ఆ మహిళ మరెవరో కాదు.. ప్రముఖ చెస్ క్రీడాకారిణి, ఇండియన్ గ్రాండ్ చెస్ మాస్టర్ వైశాలి రమేశ్ బాబు. తాను చెస్ ప్లేయర్‌నని, దేశానికి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమంటూ ఆమె పోస్ట్ చేశారు.

**ప్రయాణం ఆపొద్దు..**

ప్రధాని అకౌంట్‌ను నిర్వహించడం గొప్ప విషయమని..ఇది తనకు దక్కిన అదృష్టమన్నారు వైశాలి. ఈ రోజు మొత్తం ఆయన అకౌంట్ బాధ్యతల్ని ఆమే చూసుకోనున్నారు. ఇది తనకో ఉత్తేజకరమైన ప్రయాణమని.. ఎన్ని అవరోధాలు ఎదురైనా కన్న కలల్ని సాకారం చేసుకునే దిశగా ప్రయాణం ఆపొద్దని ఓ పోస్ట్‌లో ఆమె రాసుకొచ్చారు. ఆడపిల్లలకు పేరెంట్స్‌తో పాటు తోబుట్టువులు అండగా నిలవాలని కోరారు. వాళ్ల సామర్థ్యంపై నమ్మకం ఉంచాలని రిక్వెస్ట్ చేశారు. కాగా, వైశాలితో పాటు న్యూక్లియర్ స్పేస్ సైంటిస్టులు ఎలినా మిశ్రా, శిల్పి సోని తదితర ప్రముఖులకు కూడా మోదీ అకౌంట్ నుంచి పోస్టులు పెట్టారు.

# మహిళా సిబ్బందికి రైల్వే అరుదైన గౌరవం



**ఢిల్లీ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, సెంట్రల్ రైల్వే మొదటిసారిగా పూర్తిగా మహిళా సిబ్బందితో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపింది. జూమీ-షిర్డీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో మార్చి 8వ తేదీన పూర్తిగా మహిళా సిబ్బంది ఉన్నారు. వీరిలో లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ సహా అందరూ మహిళలే. సెంట్రల్ రైల్వేస్ ఇదే విషయాన్ని అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేస్తూ.. ఈ క్షణాలు అత్యంత గర్వకారణం, చారిత్రాత్మకమని అభివర్ణించింది. లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్, రైలు మేనేజర్, టికెట్ ఎగ్జామినర్లు, రైలు మేనేజర్, టీసీలు, రైలు హెూస్టెస్, ఆన్-బోర్డ్ క్యాటరింగ్ ఇలా అంతా మహిళలే. భారతీయ రైల్వేలో మహిళల బలం, అంకితభావం, నాయకత్వాన్ని తెలియజెప్పే ఈ రోజు మాకు గర్వించదగ్గ క్షణం' అని సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

**స్త్రీకి కష్టమైన పనంటూ ఏదీ ఉండదు..**

సెంట్రల్ రైల్వే ప్యాసింజర్ రైలు మేనేజర్ శ్వేతా ఘోన్ మాట్లాడుతూ, 'ఇది మాకు గర్వకారణమైన క్షణం... ప్రసవవేదనే భరించగలిగిన ఒక స్త్రీకి కష్టతరమైన పనంటూ ఏది ఉండదని నా అభిప్రాయం. ఆమె చేయలేనిదంటూ ఏముంది? సమాజం ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఒక స్త్రీ తన సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశం లభిస్తే.. అలాంటి మహిళ తన మొత్తం కుటుంబాన్ని సమర్థులైన వ్యక్తులుగా మార్చగలదు. ప్రతి స్త్రీ ఇలాగే జీవితంలో ఎదగగలిగితే.. మన దేశం ఎలా అభివృద్ధి చెందదు'అని అన్నారు.

# ఇజ్రాయెల్ మహిళపై సామూహిక అత్యాచారం




**బెంగళూరు:** కర్ణాటకలో అమానుష ఘటన చోటుచేసుకుంది. మన దేశానికి అపఖ్యాతి మూటగట్టుకునే విధంగా కొందరు మూకలు దారుణానికి ఒడిగట్టారు. భారత పర్యటనకు వచ్చిన ఇజ్రాయెల్ యువతి, మరో మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన బెంగళూరుకు 350 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొప్పల్‌లో చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇద్దరు మహిళల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం వారికి ఆసుపత్రిలో చికిత్స జరుగుతోంది.వివరాల ప్రకారం.. కొప్పల్‌కు చెందిన మహిళ(29) పర్యాటకుల కోసం హెూమ్ స్టే నిర్వహిస్తోంది. విదేశాల నుంచి వచ్చే టూరిస్టులకు తన ఇంట్లో ఆశ్రయం ఇస్తూ ఆదాయం పొందుతోంది. ఈ క్రమంలోనే ఇటీవలే ఇజ్రాయెల్ నుంచి ఓ మహిళ, అమెరికా నుంచి వచ్చిన డేనియల్ సహా మరో ఇద్దరికి ఆశ్రయం కల్పించింది. దీంతో, వారంతా ఆమె ఇంట్లోనే ఉంటున్నారు. అయితే, గురువారం వారంతా డిన్నర్ చేసిన అనంతరం బయటకు వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు.అనంతరం, సోనాపూర్ సమీపంలోని తుంగభద్ర కెనాల్ ఒడ్డుకు వెళ్లాలని నిర్ణయించారు. దీంతో, వారంతా గురువారం రాత్రి 11:30 గంటల సమయంలో తుంగభద్ర కాలువ వద్దకు వెళ్లారు. కాలువ ఒడ్డున కూర్చుని నక్షత్రాలను చూస్తూ మాట్లాడుకుంటుండగా గుర్తు తెలియని వ్యక్తులు కొందరు అక్కడికి వచ్చి వారిపై దాడి చేశారు. టూరిస్టులలోని ముగ్గురు మగవాళ్లను కాలువలోకి తోసేసి, ఇజ్రాయెల్ పౌరురాలితో పాటు హెూమ్ స్టే యజమానిపై అత్యాచారం చేసి పారిపోయారు. కాలువలో పడ్డ డేనియల్, మహారాష్ట్రకు చెందిన పంకజ్ బయటకు రాగా, ఒడిశాకు చెందిన బిబాష్ జాడ మాత్రం తెలియరాలేదు. ఈ క్రమంలో టూరిస్టులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని ఇద్దరు యువతులను ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు.

### కాలిఫోర్నియా గవర్నర్ రేసు బరిలో

# కమలాహారిస్?



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అప్పటి ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఓడిపోయిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు వార్తా పత్రికల్లో కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల జరిగిన పలు కార్యక్రమాల్లో కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీకి సిద్ధమైనట్లు సూచనప్రాయంగా తెలిపారు. మరికొన్ని రోజుల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం గావిన్ న్యూసమ్ కాలిఫోర్నియా గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక, ఆమె 2028 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దశాబ్దాలుగా కాలిఫోర్నియా వాసులు డెమోక్రట్లకే మొగ్గుచూపుతున్నారు. దీంతో ఆమె ఈ ఎన్నికల్లో పోటీకి దిగితే.. తప్పక విజయం సాధిస్తారని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సుంకాలు తగ్గించేందుకు భారత్ అంగీకారం: ట్రంప్

**వాషింగ్టన్ :** అమెరికాపై సుంకాల తగ్గింపునకు భారత్ అంగీకరించిందని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్ అత్యధికంగా సుంకాలు వసూలుచేస్తోందని..ఆ దేశంలో ఏవీ విక్రయించడానికి వీలు లేనంత భారంగా అవి ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని లేవనెత్తడం..భారత్ చర్యలను తాము బహిరంగ పరచడం వల్ల సుంకాలను తగ్గించడానికి ఆ దేశం అంగీకరించిందని తెలిపారు.వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో అమెరికా అధ్యక్షుడు మరోసారి సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా త్వరలో భారత్‌లో అడుగుపెట్టనుంది. ప్రస్తుతం భారత్ కార్ల దిగుమతిపై 110శాతం సుంకాలు విధిస్తోంది.ఈ విషయంపై ఎలాన్ మస్క్ ఇప్పటికే పలుమార్లు భారత్‌పై బహిరంగానే విమర్శలు చేశాడు. ప్రపంచంలోనే కార్లపై అత్యధిక సుంకాలు విధించే దేశంగా అభివర్ణించాడు. తన సంస్థను సుంకాలు లేకుండా భారత్‌లో ప్రవేశపెట్టడానికి మస్క్ అనేక ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. ఈ క్రమంలోనే అమెరికా నుంచి దిగుమతి అయ్యే కార్లపై సుంకాలను పూర్తిగా తొలగించేలా ఆ దేశంతో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్నాయి. అయితే భారత్ మాత్రం తక్షణమే సుంకాలను తొలగించే విషయంలో ఆచితూచి స్పందిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ఛావా ఎఫెక్ట్.. గుప్త నిధుల వేటలో ఊళ్లు



**బుర్హన్‌పూర్:** రాత్రయితే చాలు ఎక్కడెక్కడి నుంచో వస్తున్నారు. రాత్రంతా టార్చ్‌లైట్లు వేసుకుంటూ తవ్వకాలు జరుపుతున్నారు. జల్లెడలు, మెటల్ డిటెక్టర్లు వినియోగిస్తున్నారు. ఎవరికి వారు బంగారం, వెండి నాణేలు దొరికాయంటూ ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో చీకటి పడితే చాలు ఊళ్లకు ఊళ్ల ప్రజలు ఆ ప్రాంతంలో గుప్తనిధుల వేట సాగిస్తున్నారు. ఇదీ గత కొన్ని రోజులు మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌లోని అసిర్‌గఢ్ కోట వద్ద పరిస్థితి. బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' చిత్రంలో ఈ ప్రాంతాన్ని బంగారం గనులున్నాయంటూ పేర్కొనడం ఈ గుప్త నిధుల ప్రచారానికి ఆజ్యం పోసింది.స్థానికంగా జాతీయ రహదారుల పనుల్లో భాగంగా దర్గా సమీపంలో జేసీబీ సాయంతో ఇటీవల మట్టి తవ్వకాలు చేపట్టారు. ఆ మట్టిని కోట ఉండే గ్రామానికి సమీపంలో ఓ పొలంలో పారబోశారు. ఆ మట్టిలో స్థానికంగా ఉండే కూలీలు పురాతన నాణేలను గుర్తించారు. వాటిని మొఘలుల కాలం నాటి బంగారం, వెండి నాణేలుగా కొందరు ప్రచారం చేశారు. ఆ ప్రచారం ఆ నోటా ఈ నోటా పాకి గుప్త నిధులు ఉన్నాయన్న ప్రచారం ఊపందుకుంది. దీంతో చుట్టుపక్కల గ్రామాల వారు గుప్తనిధుల వేట మొదలు పెట్టారు. 'ఛావా' చిత్రంలో మొఘలుల కాలంలో ఈ ప్రాంతం ఛత్రపతి శంభాజీ మహారాజుకు మిలటరీ క్యాంప్‌గా ఉండేదని, బంగారం గనులు ఉండేవని పేర్కొనడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూరింది.దీంతో రాత్రయితే చుట్టు పక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. తవ్వకాలు జరుపుతున్నారు. "కొంతమందికి నాణేలు దొరకుతున్నాయి. రోజు రోజుకూ వీరి సంఖ్య పెరుగుతోంది. ఎక్కడెక్కడి నుంచో ప్రజలు వస్తున్నారు. ఎవరికి వారు తమకు దొరికాయంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పట్వారీకి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు" అంటూ స్థానికుడు ఒకరు వాపోయారు. మొఘలుల కాలంలో బుర్హాన్‌పూర్ సంపన్న నగరాల్లో ఒకటని చరిత్రకారులు పేర్కొంటున్నారు. యుద్ధ సమయాల్లో స్థానికులు తమ సంపదను భద్రంగా పూడ్చిపెట్టేవారని చెబుతున్నారు. ఈ కారణం వల్లే ఎవరైనా తవ్వకాలు జరిపితే నాణేలు దొరికే అవకాశం లేకపోలేదని పేర్కొంటున్నారు.

# ఆదరాభిమానాల్లో అత్యంత ధనవంతుడిని

(మొదటి పేజీ తరువాయి)

మహిళల జీవితాల్లో గౌరవం, సౌలభ్యం రెండింటికీ అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. కోట్లాది మంది మహిళలకు మరుగుదొడ్లు నిర్మించడం ద్వారా వారి గౌరవాన్ని పెంచామన్నారు. కోట్లాది మంది మహిళలను వారి ఖాతాలను తెరవడం ద్వారా బ్యాంకింగ్‌కు అనుసంధానించామన్నారు. ఉజ్వల సిలిండర్లను అందించడం ద్వారా, మహిళలను పొగ వంటి సమస్యల నుండి రక్షించామని ప్రధాని మోదీ తెలిపారు. సామాజిక స్థాయిలో, ప్రభుత్వ స్థాయిలో, పెద్ద సంస్థలలో, మహిళలకు మరింత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది అది రాజకీయ రంగం అయినా, క్రీడా రంగం అయినా, న్యాయవ్యవస్థ అయినా, పోలీసులైనా.. దేశంలోని ప్రతి రంగంలోనూ, ప్రతి కోణంలోనూ మహిళల జెండా ఎగురుతోందని ప్రధాని పేర్కొన్నారు.దేశ ఆత్మ గ్రామీణ భారతదేశంలో నివసిస్తుందని గాంధీజీ చెప్పేవారు అని ప్రధాని మోదీ సమావేశంలో అన్నారు. గ్రామీణ భారతంఆత్మ గ్రామీణ మహిళల సాధికారతలో నివసిస్తుందని దానికి మరో వాక్యాన్ని జోడిస్తున్నానన్నారు అందుకే ఎన్డీయే ప్రభుత్వం మహిళల హక్కులకు, మహిళలకు కొత్త అవకాశాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని ప్రధాని గుర్తు చేశారు.

# చిట్టితల్లీ.. తల్లడిల్లి

(మొదటి పేజీ తరువాయి)

లోనై నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చిన్న వయసులోనే పెళ్లి చేసుకున్న కొంతమంది బాలికలు గర్భిణులు అయ్యాక అనారోగ్యానికి గురై మృతి చెందుతున్న ఘటనలూ చోటుచేసుకుంటున్నాయి. గిరిజన బాలికల్లో పాఠశాల స్థాయిలోనే వారికి అర్థమయ్యేలా ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు కౌన్సెలింగ్ నిర్వహించాలి. తరచూ విద్యార్థినులకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు వివరించాలి. పిల్లల తల్లిదండ్రులకూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.కాగా, కిశోర బాలికల సంక్షేమం కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని పటిష్టంగా గ్రామాల్లో అమలు చేయాలన్న ఉద్దేశంతో సర్పంచి అధ్యక్షతన కమిటీలు ఏర్పాటుచేసి కిశోర బాలికల రక్షణ, సంక్షేమంపై దృష్టి సారిస్తున్నారు. బాలికల వివరాలను తీసుకొని వారి బాగోగులపై తరచూ ఆరా తీస్తున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి కిశోర బాలికలకు పోషకాహారం అందించే ఏర్పాట్లు చేశారు.

**తల్లిదండ్రుల్లో మార్పు అవసరం**

గిరి గ్రామాల్లోని తల్లిదండ్రుల వైఖరిలో మార్పు అత్యవసరం. తమ చిన్నారుల భవితపై వారు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. కౌమార దశ జీవితంలో అత్యంత కీలకమైనదన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించేలా వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. కౌమారదశ బాలికల సంరక్షణపై స్వచ్ఛందసంస్థలు చిత్తశుద్ధితో పనిచేయాలి. మండల, గ్రామస్థాయిలో మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ పీవోలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో కిశోర బాలికల బృందాలను ఏర్పాటు చేసి వారికి తరచూ కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అంగన్‌వాడీల పరిధిలోని కౌమారదశ బాలికల జాబితాలు రూపొందిస్తున్నారు. మధ్యలో బడి మానేసి ఇంటికే పరిమితమైనవారిని గుర్తించి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా బ్యుటీషియన్, హెూటల్ మేనేజ్‌మెంట్ తదితర స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. బాల్యవివాహ నిరోధక చట్టంపై గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# నిప్పుల కొలిమి

(మొదటి పేజీ తరువాయి)

పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది.

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ : శనివారం, ఆదివారం, సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది.

రాయలసీమ :శనివారం, ఆదివారం, సోమవారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణము కంటే 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముంది. అని.. అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకులు ప్రకటనలో తెలిపారు.

# మీ గౌరవాన్ని మరింత పెంచుతా..

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత నాది... పని చేసే విధానం మీది' అని చెప్పుకొచ్చారు.

**అప్పుడు వద్దన్నాను.. ఇప్పుడు కనండి..**

చైనా, జపాన్‌లో జనం సంఖ్య తగ్గిపోతోందని.. సంపాదించింది అనుభవించడానికి కూడా వారసులు లేకుండా పోతున్నారన్నారు. గతంలో ఒక్కరినే కనమని చెప్పానని.. ఇప్పుడు వీలైనంత ఎక్కువ మందిని కనమని చెబుతున్నానని తెలిపారు. గతంలో ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అవకాశం లేకుండా చట్టం చేశామని.. ఇప్పుడు ఇద్దరి కంటే తక్కువ ఉంటే పోటీ చేసే అవకాశం లేకుండా చట్టం తీసుకురావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 15000 ఇస్తామన్నారు. ఐదు మంది పిల్లలు ఉన్నా.. 60వేలు ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఎన్ని సార్లు అయినా మెటర్నిటీ సెలవులు ఇస్తానన్నారు. విజన్ 20-20 ఇచ్చి హైదరాబాద్ డెవలప్ చేశామని తెలిపారు. 2047కు ప్రపంచంలో అగ్ర దేశంగా భారత దేశం ఉంటుందని తెలిపారు. రతన్ టాటా ఛైర్మన్ అయిన తరువాత టాటా కంపెనీని ఆకాశానికి తీసుకెళ్లారన్నారు. రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెడుతున్నామని చెప్పారు. ప్రతి ఇంట్లో ఒక అంట్రప్రీమియర్ ఉండాలన్నారు. మహిళల కోసం 45 శాతం పెట్టుబడి రాయితీ ఇస్తున్నామని చెప్పారు. అబ్దుల్ కలాం కష్టపడి చదువుకుని దేశానికి రాష్ట్రపతి అయ్యారన్నారు. ప్రజల కోసం వాట్సాప్ గవర్నర్ తీసుకువచ్చామని తెలిపారు. ఏ పని కావాలన్నా వాట్సప్ గవర్నర్‌లో అయిపోయిందని అన్నారు. వాట్సాప్ ద్వారా 200 సర్వీసులు ఆన్‌లైన్‌లో పెట్టామని... రాబోయే రోజుల్లో వెయ్యి సర్వీసులు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మార్కాపురంలో. 14,705 స్వయం సహాయక సంఘాలకు రూ.1,826.43 కోట్లు రుణాలను సీఎం పంపిణీ చేశారు. స్త్రీ నిధి రుణాలు పంపిణీ కోసం వెయ్యి కోట్లు చెక్ అందజేశారు. ఆపై 100 మంది మహిళల విజయ గాథ పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు పంపిణీ చేశారు. మహిళల కోసం పోలీస్ శాఖ రూపొందించిన శక్తి యాప్‌ను ప్రారంభించారు. చేనేత రథం, ఈ-వ్యాపారి పోర్టల్ డెలివరీని మొదలుపెట్టారు. మార్కాపురంలో మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు.

**అరకు కాఫీ మరో 'స్టార్ బక్స్' కావాలి**

'మేజర్ పంచాయతీల్లోనూ అరకు కాఫీ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచాన్ని మెప్పించే శక్తి మహిళలకు ఉందన్నారు. అరకు కాఫీకి పాతికేళ్ల క్రితమే బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చినట్టు చెప్పారు. ప్రతి గ్రామంలో వీటి ఔట్‌లెట్స్ ఏర్పాటు కావాలన్నారు. మహిళలు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించే బాధ్యత నాది' అని చంద్రబాబు తెలిపారు.

# శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

తెప్పోత్సవాలు పౌర్ణమి వరకు జరుగుతాయి. ఇందుకోసం ఇంజినీరింగ్ అధికారులు తెప్పను సిద్ధం చేసి విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చి దిద్దారు. స్వామి వారి పుష్కరిణిని అందంగా అలంకరించారు. తెప్ప చుట్టూ నీటి జల్లులు (షవర్) పడేలా ఏర్పాట్లు చేశారు. తెప్పోత్సవాల్లో అలంకరణ కోసం సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్ వినియోగిస్తారు.తిరుమలలో తెప్పోత్సవాలు అత్యంత ప్రాచీనకాలం నుంచి జరుగుతున్నాయి. సాళువ నరసింహరా యలు క్రీ.శ 1468లో పుష్కరిణి మధ్యలో "నీరాళి మండపాన్ని" నిర్మించి తెప్పోత్సవాలకు అనువుగా తీర్చిదిద్దారు. క్రీ.శ.15వ శతాబ్దానికి చెందిన తాళ్లపాక అన్నమయ్య తిరుమల తెప్పోత్సవాలను గొప్పగా కీర్తించారు. వేసవి ప్రారంభంలో పున్నమి రోజుల నాటి వెన్నెల కాంతుల్లో చల్లని నీళ్లల్లో శ్రీ స్వామివారిని ఊరేగించే ఈ తెప్పోత్సవాలు భక్తులకు కనువిందు చేస్తాయి. తొలిరోజు సాయంత్రం సీత ,లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి, రెండో రోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు మాడవీధులలో ప్రదక్షిణగా ఊరేగుతూ వచ్చి పుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు విహరిస్తారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు తెప్పపై మూడో రోజు మూడు చుట్లు, నాలుగో రోజు ఐదు చుట్లు, ఐదో రోజు ఏడు చుట్లు విహరించి భక్తులను కటాక్షిస్తారు.

# మహిళలను శక్తివంతం చేయాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఎక్స్పోర్ట్ ఇన్స్పెక్షన్ ఏజెన్సీ విశాఖపట్నంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్న సంస్థ. 2025 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈఎల్పిఎ-చెన్నైలోని సబ్ ఆఫీస్, విశాఖపట్నంలో "ప్రతి స్త్రీని శక్తివంతం చేయండి: సమానత్వం, పురోగతి, చేరిక" అనే అంశంపై అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్చార్జ్ శ్రీ సుధాంసు శేఖర్ దాస్ ఇంటరాక్టివ్ సెషన్ ద్వారా జరుపుకున్నారు. దీని తర్వాత కార్యాలయంలోని అన్ని సిబ్బంది ఫిట్ ఇండియా ప్రమాణం చేశారు. ఆన్లైన్ సెషన్ ద్వారా పోషకాహారం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడం, యోగా సెషన్, ఆత్మరక్షణ శిక్షణ మరియు మహిళా సిబ్బందికి బ్యాడ్మింటన్ ఏర్పాటు చేయడం జరిగింది.

## ఆర్మ్డ్ రిజర్వ్ ప్రధాన కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి/విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- బ్యూరో):- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, కైలాసగిరి, ఆర్మ్డ్ రిజర్వ్ (ఏ ఆర్) ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి వివిధ విభాగాలను సమీక్షించారు. ఈ సందర్శనలో ఆయుధాగారం, మోటర్ ట్రాన్స్పోర్ట్ విభాగం, డాగ్ స్క్వాడ్ మరియు ఇతర విభాగాలను పూర్తిగా పరిశీలించారు.ఈ తనిఖీ సందర్భంగా వివిధ విభాగాల రికార్డులను, ఆయుధాల నిర్వహణ, వాహనాల పనితీరు, శిక్షణా ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. అన్ని విభాగాల్లో పనితీరు మరియు భద్రతా ప్రమాణాలను మెరుగుపరచేలా తగిన సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డీఎస్పీ పి.నాగేశ్వరరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మన్మథరావు, రామకృష్ణారావు తదితర అధికారులు హాజరై కార్యాచరణను సమీక్షించారు.

## మహిళల మౌలిక సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమిద్దాం




చోడవరం, (విశాఖ సమాచారమ్):- చోడవరం లోని నూకాంబిక కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా పోరాట దినం మార్చి 8 సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో విజయవంతంగా సభ నిర్వహించారు. కొత్తూరు శివాలయం నుండి సబికులు, మహిళలు, ఉపాధ్యాయులు ర్యాలీగా ప్రారంభమై సభా వేదిక వరకు నినాదాలిస్తూ తమ డిమాండ్లను తెలియజేస్తూ ర్యాలీగా వచ్చారు.సభకు అధ్యక్షత వహించిన స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓ.వి.వి.ఎస్. లక్ష్మి కుమారి మాట్లాడుతూ మహిళా దినోత్సవం వెనకున్న పోరాటాలని మహిళా త్యాగాలని అపహాస్యం చేసే విధంగా మహిళా దినోత్సవ పోరాట స్ఫూర్తిని పక్కదారి పట్టించే విధంగా నేడు మార్చి 8ని జబర్దస్త్ ప్రోగ్రాంలతోనూ పార్టీలుగాను సెలబ్రేట్ చేస్తూ మహిళలను కించపరుస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.రచయిత సూర్య ప్రకాష్ మాట్లాడుతూ పెరుగుతున్న ఆర్థిక అవసరాలరీత్యా అన్ని రంగాల్లోనూ మహిళల శ్రమ అవసరం అవుతున్న నేటి పరిస్థితుల్లో కనీస అవసరాలు మహిళలకు పని ప్రదేశంలో అవసరమైన భద్రత, సదుపాయాలు లేకపోవడం విచారించాల్సిన విషయం అన్నారు. దానికోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.జనసాహితీ జిల్లా అధ్యక్షులు ఐటిఆర్వి శివాజీ రావు మాట్లాడుతూ ప్రజలపై పెరుగుతున్న సామ్రాజ్యవాద దోపిడి అణచివేతలని గుర్తించనీయకుండా ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్న అశాంతిని అణిచివేయడానికి పాలకులు మతోన్మాదాన్ని, కుల,మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని దీనివలన ఎక్కువగా ఇబ్బందులకు గురయ్యేది శ్రమజీవులు, ముఖ్యంగా మహిళలే అని పేర్కొన్నారు.వక్తలు ఉపన్యశించిన తర్వాత ఇంటా బయట స్త్రీలు చేసే కనిపించని పనిని చర్చిస్తూ మహిళా కళాకారులు " హౌస్ వైఫ్ " అనే చిన్ననాటికను ప్రదర్శించారు. ఓ.పి.డి. ఆర్ జిల్లా కన్వీనర్ గౌరీ శంకర్ నవ యువ సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎన్.భాస్కర్ మరియు ఉపాధ్యాయులు శ్రీను, మత్స్యలింగం తమ సందేశాలను ఇచ్చిన తర్వాత మహిళల పోరాటాలు ఐక్యత వర్ధిల్లాలని నినాదాలతో సభను ముగించారు.


పెద్దకర్మ



శ్రీ వోమ్మి రాజేంద్రనాథ్ గారు
Addl. S.P (Retd.)
తేది : 25-02-2025 మంగళవారం రోజున స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము.
తేది 09-03-2025 ఆదివారం రోజున మ. 01.00 గంటల నుండి 05.00 వరకు వారి పెద్దకర్మ జరుపబడును.
మధ్యాహ్నం : 1:00 - 2:30 గంటలకు భోజనం తర్వాత
మధ్యాహ్నం : 2:30 - 5:00 గంటలకు శ్రద్ధాంజలి/ సార్థక చిహ్నం.
విలువైన జ్ఞాపకాలను పంచుకోవడానికి ప్రియమైన కుటుంబం మరియు స్నేహితులు
కావున తామెల్లరూ విచ్చేసి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని తెలియజేయడమైనది.
ఇట్లు
వోమ్మి కుటుంబ సభ్యులు
కీ॥శే॥ శ్రీ వోమ్మి రాజేంద్రనాథ్ గారు
Addl. S.P (Retd.)
జననం : 13-12-1952 మరణం 25-02-2025
కార్య స్థలము : కాకతీయ కన్వెన్షన్ సెంటర్, హాల్-1 మద్దిలపాలెం, NH-16, విశాఖపట్నం, AP-530013


# వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మద్దిలపాలెం కృష్ణ కాలేజీ రోడ్డుని వైసిపి కార్యాలయంలో శనివారం పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి

మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్ కటింగ్ చేశారు. గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ మహిళలకు నామినేటెడ్ పదవులు, పనులలో జగన్ పెద్దపీట వేశారని గుర్తు చేశా రు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్ హామీలను అమలు చేస్తామని చెప్పి మోసం చేశారని మండి పడ్డారు.

బండి ప్రియ, కోసెట్టి రాజ్యలక్ష్మి మీసాల సంధ్య తదితర మహిళా ప్రముఖులను సన్మానించారు.

నగర్ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాజీ పార్లమెంట్ సభ్యురాలు గొట్టేటి మాధవి, పార్టీ సమ న్వయకర్తలు కేకే రాజు,తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి ,మాజీ శాసన సభ్యులు తిప్పలు గురుమూర్తి రెడ్డి ,చింతలపూడి వెంకటరమణ, తైనల విజయ కుమార్, శోభ హైమవతి, కె.భాగ్య లక్ష్మి ,డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, రాష్ట్ర అనుబంధ విభాగాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం - జెడ్ జోగిపేట వరకు బస్సు సౌకర్యం కల్పించాలి



రావికమతం, (విశాఖ సమాచారమ్):- మండలంలోని చీమలపాడు పంచాయతీ నేరేడు బంధ గ్రామం నుండి బంగారు బందలు గ్రామం వరకు పాదయాత్ర నిర్వహించారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించడం జరిగిందని నాయకులు తెలిపారు.

చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన నేరేడు బంధ. జీ లుగులో. సొంపురం బండలు 30 కుటుంబాలు పీవీటి జి కొందు గిరిజనులు గ్రామాల్లో నివసిస్తున్నారు. వీరికి నేటికీ ఆ గ్రామాల్లో పనులు కల్పించలేదు. తక్షణమే పనులు కల్పించాలని. డిమాండ్ చేయడం జరిగింది. ఈ మధ్యకాలంలో ఎన్ ఆర్ జి ఎస్ పి డి ని కలిసి ఏ గ్రామ ఒక ఆ గ్రామంలో పనులు ఇవ్వాలని కోరగా, మేము ఆ విధంగా ఇవ్వడానికి సాధ్యం పడలేదు,వాళ్ళు కిందికొచ్చి పని చేస్తే ప్రయాణం చార్జీలు కూడా ఇస్తున్నామని చెబుతున్నారు. కొండమీద నుండి కిందికి రావాలంటే రాను పోను ఎనిమిది కిలోమీటర్ దూరం నడక దారిన రావాల్సి వస్తుంది.ఉపాధి పథకం పీడి కొండ శిఖర నేరేడు బంధ, జీలుగులోవ గ్రామాలకి ఒకసారి సందర్శించండి అని, సందర్శిస్తే గిరిజన కష్టాలు ఏంటో తెలుస్తాయని సిపిఎం నాయకులు కే గోవిందరావు ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన పోతురాజు బాబు గుడి ప్రతి మహాశివరాత్రి నాడు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నది ఆర్టీసీ సంస్థ లక్షల రూపాయలు లాభార్జన అర్జిస్తున్నారు. పండగ అయిన వెంటనే. గిరిజన గ్రామాలకు ఆర్టీసీ వారు బస్సులు గతంలో నడిపేవారు. దీనిద్వారా జెడ్ కొత్తపట్నం, కొత్తకోట కాలేజీ స్కూల్ కి గిరిజన పిల్లలు రానుపోను వెళుతూ ఉండేవారు.ఈ మధ్యకాలంలో ఆ బస్సు కూడా నడవలేదు, ఆదాయం కావాలంటే బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. గిరిజనులకు రవాణా సౌకర్యాలు అందించడంలో ఆర్టీసీ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ఈనెల 25వ తారీకు నాడు నర్సీపట్నం ఆర్టీసీ డిపో వద్ద ప్రత్యేక ధర్నా నిర్వహిస్తాం. జీడిపెక్కలకి ప్రభుత్వం మద్దతు ధర కేటాయించాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలి. ఈ డిమాండ్తో రానున్న కాలంలో భారీ ఎత్తున ఆందోళన చేయాలని సిపిఎం పిలిపించింది. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు. డిప్పల అప్పారావు. సేదరి కామేశ్వరరావు. కొర్ర మహేష్ 20 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలకు ఉచిత ఫెర్టిలిటీ సహాయం

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఫెర్టిలిటీ అనేది ఎప్పుడూ ఒంటరిగా ఎదుర్కోకూడని ప్రయాణం. అయినప్పటికీ, చాలా తరచుగా, మహిళలు అంచనాల బరువును భరిస్తారు, వారి శరీరాలు మరియు స్థితి గురించి ప్రశ్నలను ఎదుర్కొంటారు. మహిళలు ఎన్నడూ కోరుకోని సలహాలు మరియు వారికి అవసరం లేని పరిష్కారాలను వినాల్సి ఉంటుంది. గైనకాలజిస్ట్ క్లినిక్ లో కూడా, వారి రిపోర్టులు, వారి జీవనశైలి మరియు వారి పనులపై దృష్టి ఎక్కువగా ఉంటుంది. కానీ ఫెర్టిలిటీ అనేది కేవలం ఆడవారి బాధ్యత మాత్రమే కాదుబీ ఇది జంటగా పంచుకునే ప్రయాణం, ఇది ఇద్దరు భాగస్వాములు అవగాహన, మద్దతు మరియు కలిసి నిర్ణయాలు తీసుకోవడానికి సంబంధించినది.

ఒయాసిస్ ఫెర్టిలిటీ మగవారు మరియు ఆడవారి ఇద్దరికీ సైన్స్-ఆధారిత సమగ్ర సంరక్షణ మరియు ప్రత్యేకమైన చికిత్సా ప్రణాళికలను అందించడం ద్వారా ఫెర్టిలిటీ ప్రయాణాన్ని కొత్తగా ప్రదర్శిస్తుంది. అధునాతన డయాగ్నోస్టిక్స్, నిపుణుల సంప్రదింపులు, అత్యాధునిక చికిత్సల అందించడమే కాకుండా, ఒయాసిస్ ఫెర్టిలిటీ మహిళలకు అవసరమైన పరిజ్ఞానంతో ఆలోచన శక్తి కల్పిస్తుంది, అదే సమయంలో జంటలు కలిసి సంతానోత్పత్తిని పొందేలా ప్రోత్సహిస్తుంది. ఈ నిబద్ధతను మరింత పెంచడానికి, ఒయాసిస్ ఫెర్టిలిటీ మార్చి 1 నుండి 31 వరకు భారతదేశంలోని అన్ని కేంద్రాలలో ఉచిత ఫెర్టిలిటీ అసెస్మెంట్ ప్రయత్నాన్ని ప్రారంభిస్తోంది. ఇందులో ఉచిత ఎఎమ్హెచ్ పరీక్ష (సిఫారసు చేయబడితే) మరియు అన్ని ఫెర్టిలిటీ పరీక్షలు ఉన్నాయి, ఫెర్టిలిటీ ఆరోగ్యంపై కీలకమైన వివరాలను అందిస్తాయి. ఒయాసిస్ ఫెర్టిలిటీ అనేది సంతానోత్పత్తి సంరక్షణకు గొప్ప విధానాన్ని అనుసరిస్తుంది, భాగస్వాములిద్దరికీ సరైన మద్దతును అందిస్తుంది మరియు మీ మాతృత్వ పొందే ప్రయాణంలో సైన్స్ యొక్క మంచి భావాలు మీకు మార్గనిర్దేశం చేస్తాయి.

సంతానోత్పత్తి లోపం అనేది ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సమస్య, ప్రతి 4 ఇన్ఫెర్టిలిటీ జంటలలో ఒకరు భారతదేశం నుండి ఉన్నారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ ఐవిఎఫ్ మరియు ఇతర సంతానోత్పత్తి చికిత్సల ద్వారా 1,00,000ం పిల్లలను ప్రసవించడంలో సహాయపడింది. 15 సంవత్సరాల నైపుణ్యంతో, ఒయాసిస్ ఫెర్టిలిటీ పిసిఒఎస్ లేదా పిసిఒడి ఉన్న రోగులకు ప్రయోజనకరమైన డ్రగ్ లేని ఐవిఎఫ్ ఎంపిక అయిన కాపా ఇన్ విట్రో మెచ్యూరేషన్ (ఐవిఎమ్) ను భారతదేశానికి ప్రవేశపెట్టింది.

# అప్పుడే నవ నారీ నర్తనోత్సవం



నాగుల చవితి రోజున నాగుకు పూజించినట్టే
ఆ తరువాత కనిపిస్తే చంపుతున్నట్టే
ఆవుకు ఆ రోజున పసుపు రాసి మొక్కినట్టే
ఏ రోజు పాలివ్వకపోతే బడిత దెబ్బలే
అదే మాదిరి ఈ దేశంలో ఆడ బతుకు
ఎక్కడ పడతి పూజింపబడుతుందో
అక్కడ దేవతలు నర్తిస్తారని గొప్పలు
ఆచరణలో ఎక్కడో ఓ దగ్గర ఆర్తనాదం
ఇదీ ఈ దేశంలో స్త్రీ జీవనం

మహిళా దినోత్సవ వేళ
పొగడ్తలు చూస్తుంటే... వింటుంటే
ఆ నాగు ... ఆ గోవులే గుర్తుకువస్తుంటాయ్
ఆడదాని గమనం గండాలమయమేనని
అబల సబలగా మారేదెప్పుడని
మతం ముసుగులు తొలిగినప్పుడే
నిజమైన నారీనర్తనోత్సవమని

(మహిళా దినోత్సవం సందర్భంగా వినమ్రంగా...చింతాడ కృష్ణారావు, శ్రీకాకుళం, 80086 79666)

## గోశాలలో ఆవు దూడకు పుట్టినరోజు వేడుకలు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- శ్రీ స్వామి వివేకానంద గోశాలలో ఉన్న గోమాత లక్ష్మి కి పుట్టిన మొదటి సంతానం ఆవు దూడ సురభి రెండవ పుట్టినరోజు వేడుకలను వివేకానంద సంస్థ సభ్యులు ఘనంగా జరిపారు. ముందుగా గోమాత లక్ష్మీదేవికి, ఆవు దూడ సురభికి పసుపు కుంకుమలతో పూజలు చేసి, హారతి ఇచ్చారు. అనంతరం ముత్తయిదువులకు తాంబూలాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మహిళా సభ్యులు ఉమాదేవి, కనకమహాలక్ష్మి మరియు ప్రజలు పాల్గొన్నారు.

# బీచ్ క్లీనింగ్..




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- "నేను - నా దేశం కలిసి అభివృద్ధి చెందుతాము" అనే నినాదంతో విశాఖ బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ (కొమ్మాది బ్రాంచ్) ప్రిన్సిపల్ లక్ష్మి శోభ, సిబ్బంది ఆధ్వర్యంలో బీచ్ శుభ్రత చేపట్టారు.

# అందుబాటులోకి రిజిస్ట్రేషన్ సేవలు

జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- భూముల రిజిస్ట్రేషన్ సేవలను జిల్లాలో అందుబాటులోకి తీసుకుని రావాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చట్టాలను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. శుక్రవారం ఐటిడి ఏ పి ఓలు, సబ్ కలెక్టర్లు, భూములు రిజిస్ట్రేషన్లు స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ, ఎంపిడి ఓలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8 వ తేదీన రంపచోడవరం పి. యం. ఆర్ .సి భవనంలోను, పాడేరు ఎపి ఆర్ జెసి కళాశాలకు ఎదురుగా ఉన్న భవనంలోను స్టాంప్స్ మరియు సబెజిస్ట్రార్ కార్యాలయాలను ప్రారంభించాలని చెప్పారు. గతంలో తాహశీల్దారు కార్యాలయాల్లో జరిగిన భూముల రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించి భద్ర పరచాలని తాహశీలార్థులను ఆదేశించారు. గతంలో రిజిస్ట్రేషన్ చేసిన భూముల రికార్డులను డిజిటలైజేషన్ చేయాలన్నారు. మే 1 వ తేదీ నుండి అనుమతులు లేకుండా లేఅవుట్లు ఏర్పాటు, భవన నిర్మాణాలు చేయడాని వీలు లేదన్నారు. సంబంధిత గ్రామ పంచాయతీల నుండి లేఅవుట్లు, భవన నిర్మాణాల ప్లాన్లను ఆన్లైన్ లో ఆమోదం తీసుకోవాలని స్పష్టం చేసారు. జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్ విలువలను రిజిస్ట్రార్ కార్యాలయం igrs.ap.in వెబ్ సైట్లో పొందుపరచడం జరిగిందన్నారు.

ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ పి ఓలు డా. ఎం. జె. అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, అపూర్వ భరత్ సబ్కలెక్టర్లు శౌర్యమన్ పటేల్, కె. ఆర్. కల్పశ్రీ, జిల్లా రిజిస్ట్రార్ టి. ఉపేంద్రరావు, పాడేరు సబ్ రిజిస్ట్రార్ కె. రమేష్, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, గ్రామ సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్ పి. ఎస్. కుమార్, తాహశీల్దారులు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
ఆదివారం 9-3-2025

## 'గుడ్లు' తేలేస్తున్న అమెరికా

భారతదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో గుడ్ల ధర పడిపోతుంటే అమెరికాలో మాత్రం వాటి ధర ఆకాశాన్నంటుతోంది. దీనికి కారణం కనీవినీ ఎరగని కొరత. అధిక ధర పెట్టయినా కొందామంటే వాటిపైనా ఆంక్షలు. మొత్తమ్మీద అగ్ర రాజ్యం 'గుడ్లు' తేలేస్తోంది. తీవ్ర గుడ్ల కొరతతో అమెరికా కొద్ది నెలలుగా సతమతమవుతోంది. రోజులు గడుస్తున్న కొద్దీ సమస్య మరింత తీవ్రతరమవుతోందే తప్ప తెరిపిన పడే సూచనలే కన్పించడం లేదు. దాంతో అమెరికన్లలో అత్యధికులు ఉదయం అల్పాహారంగా తినే గుడ్లు ఒక్కసారిగా విలాస వస్తువుగా మారిపోయిన దుస్థితి. అమెరికాలో కొద్ది నెలల క్రితం మొదల్కైన గుడ్ల కొరత నానాటికీ పెరిగిపోతోంది. బర్డ్‌ఫ్లూగా పిలిచే హెచ్5ఎన్1 తీవ్రతే ఇందుకు ప్రధాన కారణం. తొలుత కెనడాలో తలెత్తిన ఈ మహమ్మారి 2022లో అమెరికాలో ప్రవేశించింది. చూస్తుండగానే 50 రాష్ట్రాలకు విస్తరించింది. దీని వ్యాప్తిని అడ్డుకునేందుకు ఈ మూడేళ్లలో ఏకంగా 16 కోట్ల గుడ్లు పెట్టే కోళ్లను చంపేయాల్సి వచ్చింది. 2024లోనే 3 కోట్ల కోళ్లను చంపేశారు. వీటిలో 1.7 కోట్ల కోళ్లను కేవలం గత నవంబర్, డిసెంబర్ మాసాల్లోనే అంతమొందించారు. అలా ప్రస్తుతం అమెరికాలో గుడ్లు పెట్టే కోళ్ల సంఖ్య 30 కోట్లకు పరిమితమైంది. ఐదేళ్ల క్రితంతో పోలిస్తే ఇది ఏకంగా 11 శాతం తగ్గుదల. అలా మొదల్కైన గుడ్ల కొరత కొద్ది నెలలుగా తీవ్ర రూపు దాల్చింది. కొద్ది రోజులుగా డజను గుడ్లు ఏకంగా 5 డాలర్లకు చేరినట్టు బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ వెల్లడిరచింది. అంటే 435 రూపాయలు.

ఒక్క గుడ్డు రూ.36 అన్నమాట. ఇది అమెరికా చరిత్రలోనే ఆల్‌టైం గరిష్ఠం. షికాగో, న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో వంటి పలు పెద్ద నగరాల్లోనైతే డజను గుడ్ల ధర ఏకంగా 8 నుంచి 10 డాలర్ల దాకా ఎగబాకింది. దాంతో గుడ్ల కొనుగోలుపై పరిమితి విధిస్తూ రెండు నెలల క్రితం తీసుకున్న నిర్ణయాన్ని పలు సూపర్‌మార్కెట్లు ఇప్పటికీ కొనసాగిస్తున్నాయి. కొన్నిచోట్ల అయితే ఒక్కో కస్టమర్‌కు గరిష్ఠంగా 2 గుడ్లే అమ్ముతున్నాయి. డెన్నీస్, వాఫుల్ హౌస్ వంటి రెస్టారెంట్ చెయిన్లు ఒక్కో గుడ్డుపై 50 సెంట్ల సర్‌చార్జీ కూడా వడ్డిస్తున్నాయి.

సమీప భవిష్యత్తులో కూడా గుడ్ల ధరలు తగ్గే పరిస్థితి కన్పించకపోవడం అమెరికన్లను మరింత కలవరపెడుతోంది. కోళ్ల కొరతను అధిగమించడానికే కనీసం మరికొద్ది నెలలు పట్టవచ్చని చెబుతున్నారు. అప్పటిదాకా పరిస్థితి ఇంతేనని సమాచారం. గత ఫిబ్రవరి నెలలోనే గుడ్ల ధరలు ఏకంగా 15 శాతం ఎగబాకాయి. గతేడాదితో పోలిస్తే ఇప్పటికే సగానికి సగం పెరిగిపోయాయి. ఇది ఇక్కడితో ఆగదని, ఈ ఏడాది గుడ్ల ధరలు కనీసం 40 శాతానికి పైగా పెరగవచ్చని అమెరికా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ట్రంప్ సర్కారు కూడా పరోక్షంగా అదే చెప్పింది.

'ఏడాదిన్నరలోగా డజను గుడ్ల ధర ఎప్పట్లా 2 డాలర్ల లోపుకు దిగొచ్చేలా చర్యలు తీసుకుంటాం'' అని వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ చెప్పారు. దాంతో గుడ్ల కొరతను అధిగమించేందుకు తుర్కియే వైపు చూస్తోంది. గతంలో కెనడా, నెదర్లాండ్స్, బ్రిటన్, చైనా నుంచీ అమెరికా గుడ్లను దిగుమతి చేసుకున్నా కొన్నేళ్లుగా ఒక్క తుర్కియేకే పరిమితమైంది. ఆ దేశం నుంచి ఈ ఏడాది కనీసం 42 కోట్ల గుడ్లను దిగుమతి చేసుకోవాలని భావిస్తోంది. అయినా పెద్దగా ఒరిగేదేమీ ఉండబోదని పరిశీలకులు పెదవి విరుస్తున్నారు. ఫ్లూ సమస్య ఇలాగే కొనసాగితే దాని తాలూకు లోటును, ఉత్పత్తి నష్టాలను భర్తీ చేసుకోవడానికే ఈ దిగుమతులు చాలవని చెబుతున్నారు. అమెరికాలో ఏటా సగటున 9,000 కోట్లకు పైగా గుడ్లు ఉత్పత్తవుతాయి. ఫ్లూ కారణంగా మూడేళ్లలో 14 కోట్ల కోళ్లను చంపేయాల్సి వచ్చింది. 2024లో తుర్కియే నుంచి 7 కోట్ల గుడ్లు దిగుమతి చేసుకున్నారు. ఈసారి ఏకంగా 42 కోట్ల గుడ్లు దిగుమతి చేసుకోనున్నారు. ఇది దేశ చరిత్రలోనే అత్యధికం. అయినా డిమాండ్‌ను తట్టుకోవడానికి ఇది ఏమాత్రమూ చాలదంటున్నారు.

## అమెరికా భారతీయులకు 'బహిష్కరణ' ముప్పు



అమెరికాలో వలసదారుల పై కన్నెర్ర చేస్తున్న ట్రంప్ యంత్రాంగం వీసా గడువు ముగిసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నది.ఈ అంశం అనేక మంది భారతీయులను కలవరపాటుకు గురిచేస్తున్నది.తాము స్వచ్ఛందంగా అమెరికా విడిచి వెళ్లాల్సి ఉందని భయపడుతున్నారు.సుమారు లక్షమంది పైగా భారతీయులు అమెరికా బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. హెచ్4 డిపెండెంట్ వీసా తో హెచ్1 బీ వీసా ఉన్న తల్లిదండ్రులతో కలిసి వచ్చిన పిల్లలకు 21 ఏళ్లు నింపడమే తాజా ఆందోళనకు కారణం.మైనర్లగా అమెరికా వెళ్లిన వీరికి 21ఏళ్లు నిండే వరకూ ఈ వీసా పనిచేస్తుంది.కొత్త వీసా పునరుద్ధరణకు రెండేళ్ల గడువు ఉంటుంది.కాని ట్రంప్ హయాంలో ఈ గ్రేస్ పీరియడ్ లో కోతలు ఉండవచ్చు. డిపెండెంట్ వీసా ముగిసిన పిల్లల సంఖ్య 1.34 లక్షలుగా ఉంది.వీసా ముగిసిన వారు ఉన్నత చదువుల కోసం స్టూడెంట్ వీసా అవకాశం ఉంది.కాని అంత సులభం కాదు.వీసా పునరుద్ధరణకు రెండేళ్ల సడలింపు పై న్యాయస్థానాల అభిప్రాయాలు కొత్తగా ఆందోళనకు కారణమవుతోంది. ఇప్పటివరకూ సరైన పత్రాలు లేని వారికి డీఏసీఏ నిబంధన రక్షణ కల్పించేది.కాని న్యాయస్థానం ఇది చట్టవిరుద్ధమైనదని తీర్పు చెప్పింది.భారతీయులు గ్రీన్ కార్డు కోసం అధిక కాలం వేచి ఉండాల్సి వస్తున్నది. ఇది కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.అందుకే అమెరికాలో ఉన్న భారతీయులు కెనెడా,బ్రిటన్ వైపు చూస్తున్నారు.అక్కడ ఇమ్మిగ్రేషన్ విధానాలు సరళంగా ఉంటాయని భావిస్తున్నారు.ఆప్టికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (వోపీటీ) స్కామ్ లో ఉన్న వారి వీసాలు కూడా రద్దయ్యే అవకాశాలు ఉన్నాయి. చదువు కోసం వచ్చిన విద్యార్థులకు మరో మూడేండ్లు అక్కడ ఉండే అవకాశం ఉంది.కాని కొన్ని కంపెనీలు ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేయడంతో వారు చిన్నచిన్న ఉద్యోగాలు చేసు కుంటూ అక్కడే ఉంటున్నారు.ఆయా కంపెనీలపై అమెరికా యంత్రాంగం దాడి చేసి వోపీటీ స్కామ్ లో చేర్చితే సమస్య ఎదుర్కోవచ్చు.ఏదిఏమైనా అమెరికాలో ఉంటున్న డిపెండెంట్ పిల్లలకు 21 ఏళ్లు నిండగానే సమస్యలు తలెత్తుతాయి.తల్లిదండ్రులు ఒకచోట,పిల్లలు మరోక చోటు ఉండే పరిస్థితి ట్రంప్ విధానాలతో భారతీయులు ఎదుర్కొనే భయం పీడిస్తున్నది.వారు వేరే దేశం వెళ్లడమో స్వదేశానికి రావడమో తప్ప గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడింది.

యం.వి.రామారావు,8074129668

## హనుమంతుడు - సిందూరం



హనుమంతుడికి సిందూరం అంటే చాలా ఇష్టం. అశోకవనంలో సీతను చూసిన హనుమంతుడు ఆమె పెట్టుకున్న సిందూరాన్ని చూసి అది ఎందుకు పెట్టుకున్నారని అడుగుతాడు. తాను సిందూరం పెట్టుకోవడం వల్ల తన భర్త రాముడికి సకల సౌఖ్యాలు జరుగుతాయని సీత చెప్పింది. ఆ మాటతో వెంటనే హనుమంతుడు కూడా తన ఒంటి నిండా సిందూరం పూసుకుంటాడు. ఈ కథ అందరికీ తెలిసిందే.

**అయితే ఇక్కడ మరొక కథ కూడా ఉంది. అదేంటో చూద్దాం....**

రావణ సంహారం తర్వాత జరిగిన కథ సంఘటన ఇది. ఎప్పుడూ శ్రీరాముడు దగ్గరే ఉంటూ ఆయనకు సేవలు చేయాలన్నది హనుమంతుడి కోరిక. ఆ విధంగానే అతనెప్పుడూ రాముడికి దగ్గర్లోనే ఉంటాడు. శ్రీరాముడికి ఏం కావాలన్నా చేసి పెట్టేవాడు. అంతా సవ్యంగానే జరుగుతూ వస్తోంది.

అయితే ఓసారి రాముడు హనుమంతుడిని పిలిచి "ఆంజనేయా! నువ్వూ వెళ్లు. సమయం దాటుతోంది. వెళ్ళి నీకు కేటాయించిన చోటుకెళ్ళి విశ్రాంతి తీసుకో. రేపు ఉదయం రా" అని అంటాడు.

రాముడి మాటలకు హనుమంతుడు నిశ్చేష్టుడవుతాడు.

"స్వామీ! మీరిలా అనడం ఏం న్యాయం చెప్పండి? ఎందుకు నన్ను పొమ్మంటున్నారు? మీరెక్కడ ఉంటారో అదే నా చోటు. రాత్రంతా మీ పాదాలు ఒత్తుతూ మీరు పడుకున్న తర్వాత నేనూ విశ్రాంతి తీసుకోవాలనుకున్నాను. రాముడికి పగటి పూట చేసే సేవలకు అంతరాయాలు కలగవచ్చేమో కానీ రాత్రి పూట ఏ అంతరాయం లేకుండా చేసుకుపోవచ్చునుకుంటే మీరేమో నన్ను బయటకు వెళ్ళి విశ్రాంతి తీసుకోమంటున్నారు. ఇదెంత వరకు సబబో చెప్పండి" అని అడిగాడు ఆంజనేయుడు.

రాముడు మనసు కరిగింది.

"హనుమంతుడికి నా మీద ఎంత ప్రేమ? ఎంత భక్తి? ఎంత అణకువ? ఎంత మర్యాద?" అని తనలో తాను అనుకుని "సరే హనుమంతా! నా పడగ్గదిలో నువ్వు కాస్సేపు ఉండొచ్చులే" అంటాడు రాముడు ఆ పూట.

ఆ మాటలతో హనుమంతుడికి సంతోషం వేసింది.

"అయితే కాస్సేపేనా? రాత్రంతా ఉందామనుకున్నాను కదా? రాత్రంతా ఉండనిచ్చే ఆనందం ఇచ్చేట్టు లేరే రాముడు...." అని మనసులో అనుకున్నాడు.

రాముడు నవ్వుకుంటూ తన పడగ్గదిలోకి వెళ్లాడు. అక్కడ సీత లేదు. ఆమె తన అత్త అయిన కౌసల్యకు సేవ చేయడానికి వెళ్ళింది.

అక్కడ పనులన్నీ కానిచ్చుకుని ఆమె తిరిగొచ్చింది. వయస్సు మళ్ళిన వాళ్ళలో రెండు రకాల వాళ్లు ఉంటారు. కొందరు త్వరగా నిద్రపోతారు. మరికొందరు ఆలస్యంగా నిద్రపోతారు. వీరిలో రెండో రకం కౌసల్య. ఆమె నిద్రపోయేవరకు కౌసల్యకు కాళ్ళు ఒత్తడం సీత పని. అలా సీత వచ్చేవరకు హనుమంతుడు అక్కడ ఉండొచ్చు అన్నాడు. అప్పటి వరకూ హనుమంతుడు రాముడికి కావలసిన సేవలు చేసే భాగ్యం కలిగిందన్న మాట. హనుమంతుడు రాముడికి కాళ్లు ఒత్తాడు. కొంతసేపు గడిచింది. సీత వస్తున్నప్పుడు ఆమె కాలికున్న అందియల సవ్వడి వినిపించింది. ఆ సవ్వడి చెవిన పడగానే రాముడు హనుమంతుడితో "ఆంజనేయా! నువ్విక వెళ్ళొచ్చు" అని కంటి సౌంజ్ఞతో చెప్పాడు.

ఆంజనేయుడు తల అడ్డంగా తిప్పి "నేనెందుకు వెళ్లాలి?" అని అడిగాడు.

"ఎందుకేంటీ? బలే అడిగావు" అని రాముడు చెప్తుండగానే గది వాకిలి దగ్గర సీత ఓ గ్లాసు మంచి నీళ్ళతో నిల్చునుంది.

రాముడు సీతను చూశాడు.

అంతే వేగంతో రాముడు ఆంజనేయుడివైపూ తిరిగి చూసాడు.

"ఆంజనేయా! అర్థమైందా? సీత వచ్చేసింది. నువ్వు వెళ్ళక తప్పదు మరి" అని చెప్పక చెప్పాయి రాముడి చూపులు.

కానీ ఆంజనేయుడు ఊరుకుంటాడా?

"అమ్మ వస్తే నేనెందుకు వెళ్లాలి? అమ్మలో ఉన్న విశేషమేమిటట?" అని అడిగాడు ఆంజనేయుడు.

శ్రీరాముడు కాస్త ఆలోచించి జవాబిచ్చాడు.

"అమ్మ పాపిట చూడు. సిందూరం (కుంకుమ) ఉంది కదా? సీతకు ఆ కుంకుమ వల్ల వచ్చిన విశేషమే. అంతకంటే ఇంకేం చెప్పను?" అన్నాడు రాముడు.

ఆ మాటలు విన్న ఆంజనేయుడు "ఆహా! సిందూ రమే ఆ విశేషమా? అయితే నేనూ సిందూరం పూసుకుంటే రాత్రంతా రాముడి సేవలో ఉండొచ్చన్నమాట...." అనుకుని "జయ జయ రాం, జయ జయ రాం..." అని చెప్పుకుని గంభీరంగా గర్జించి బయటకు వెళ్ళిపోయాడు హనుమంతుడు.

ఆ రాత్రి ఆంజనేయుడు అక్కడా ఇక్కడా వెతికాడు సిందూ రం కోసం. మొత్తానికి ఓ చోట సిందూరం ఉన్న చోటు కనుక్కున్నాడు. అయితే అప్పుడు అక్కడ తలుపులు వేసున్నాయి. అంతమాత్రాన ఆంజనేయుడు బాధ పడలేదు. ఒక్క క్షణంలో తలుపు తీసేసి లోపలికి వెళ్లాడు. అక్కడున్న సిందూరం తీసుకున్నాడు. పెట్టె తెరచి చూశాడు. సీతలాగా తాను పాపిట సింధూరం పెట్టుకుంటే ఎలా ఉంటుంది అనుకున్నాడు. కానీ ఆంజనేయుడికి అనుకోని సమస్య తలెత్తింది.

"నా శిరస్సులో పాపిడెక్కడుందని ఎలా తెలుసుకోవడం?" అనే సందేహం కలిగింది.

ఆ సమస్య కూడా కొన్ని నిముషాలే. అనంతరం ఆంజనేయుడికి ఓ ఆలోచన వచ్చింది.

పాపిట సిందూరం పెట్టుకోవడం వల్లే కదా సీతను రాముడు ఎప్పుడు పడితే అప్పుడు తనతో ఉండనిస్తున్నాడు. అయితే అప్పుడు హనుమంతుడు మరో విధంగానూ ఆలోచించాడు. సీతాదేవి రాముడికి దూరమై పది నెలలు తపించాల్సి వచ్చింది కదా?! రావణ సంహారం ముగియడంతోనే "నువ్వు ఎక్కడికైనా వెళ్లి ఉండొచ్చు..." అని రాముడు సీతాదేవితో చెప్పాడు కదా?

దీనికంతటికీ కారణం, సీతాదేవి ఒక్క పాపిట మాత్రమే సిందూరం పెట్టుకోవడం వల్లే కదా? అలా కాకుండా తాను దేహమంతా సింధూరం పూసుకుంటే రాముడు తననెప్పుడూ విడవడు కదా? అని అనుకుని శిరస్సు మొదలుకుని అరికాలి వరకూ పూసుకున్నాడు. సింధూర ఆంజనేయుడిలా తయారై రాముడి గది దాకా వచ్చాడు. హనుమంతుడి దేహమంతా ఎర్రగా ఉంది. ఆకాశం ఎర్రగా ఉంటే ఎలా ఉంటుందో అలా ఉన్నాడు హనుమంతుడు.

ఉదయం అనుష్ఠానం కోసం రాముడు లోపలి నుంచి బయటకు వచ్చాడు. గది దగ్గర నిల్చున్న ఆంజనేయని చూశాడు. ఆంజనేయుడిని కౌగిలించుకున్నాడు.

మనమూ ఆంజనేయుడికి సింధూరం పూసి అతని కృపకు పాత్రులమవుదాం. భక్తిలో ఆడంబరం ఉండక్కర్లేదు. మానసికంగా అర్చించి, ఆరాధిస్తే చాసు. ఆంజనేయుడి అనుగ్రహం పొందవచ్చు. ఆంజనేయుడిని అర్చించడం ద్వారా శత్రుభయం, రోగ భయం, పేదరికం వంటివి తొలగిపోతాయి. ఆంజనేయుడి అనుగ్రహంతో మన జీవితంలోనూ సుఖశాంతులకు లోటుండదు. సంతోషమూ నెలకొంటుంది.

యామిజాల జగదీశ్, కవి, రచయిత,
సీనియర్ జర్నలిస్టు

## మగువలకు జేజేలు



కష్టపడే తరుణులకు
ఇష్టమైన పనులుంటే
కాలమంతా ఉత్సాహమే!

కలలు కనే ముదితకు
నిజం చేసుకునే క్రమంలో
నిరంతరం పరీక్షలే!

అలుపుకు గెలుపివ్వని
అంతరంగమున్న అమ్మాయికి
అడుగడుగునా ఆనందాలే!

ధ్యేయమంటూ ఉన్న సుదతికి
ధైర్యం దైవం.
రెండూ నేస్తాలే!

ధర్మం తెలిసిన నెలత
మర్మమెరిగి నడచుకుంటే
బంధాలన్నీ సొంతాలే!

మాటమీరక మనసులందు
చోటు గెలిచే మానినికి
మనుగడ నల్లేరు మీది నడకలే!

తాను ఎదిగి పదుగురికి
బ్రతుకునిచ్చు పడతికి
విజయాలు కొంగున బంగారాలే!

ఎంత ఎదిగినా కొంత
ఒదిగి ఉండు ఎలనాగ
ఎల్ల వేళలా పొందు మెప్పులే!

నియంత్రణ నిర్వహణ
సహకారం సహనం
తెలివైన మహిళలకు నగలే!

సకల నైపుణ్యము సంపాదించి
జగతి నేలు దిశ వైపు సాగిపోవు
వనితలకివే వేవేల జోతలు

## నందీశ్వరుడి కొమ్ముల మధ్యలోంచి శివలింగాన్ని ఎందుకు చూస్తారు?



పరమేశ్వరుడి పరమభక్తుడైన శిలాదుడి కుమారుడే నందీశ్వరుడు. పుట్టుకతోనే అతడు శివభక్తి సంపన్నుడు. సకల శాస్త్రాలూ అభ్యసిస్తూనే.. మరోపక్క మహేశ్వరుణ్ణి సదా ధ్యానిస్తూ ఉండేవాడు. ఒకసారి నందీశ్వరుడు శ్రీశైలం వచ్చి తపస్సులో నిమగ్నమయ్యాడు. ఆ తపోదీక్షకు మెచ్చిన త్రిలోచనుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. పదివేల ఏళ్లు తపస్సు చేసే శక్తిని ప్రసాదించమని నందీశ్వరుడు అర్థించాడు. ఈశ్వరుడు తథాస్తు! అన్నాడు. పదివేల సంవత్సరాలు తపస్సు చేశాక, నందికి నీలకంఠుడు గణాధిపత్యం ప్రసాదించాడు. తనకు అత్యంత సన్నిహితంగా ఉండే అదృష్టాన్ని కల్పించాడు. శ్రీశైలంలోనే కొలువుతీరేలా అనుగ్రహించాడు. శ్రీశైలఖండం కావ్యంలో ఈ వృత్తాంతం లిఖితమైంది.

**నందికి నమస్కారం**

మహాశివుడి ఎదుట ఉండే నంది ధర్మ స్వరూపం. నంది నాలుగు పాదాలు చతుర్వేదాలకు ప్రతీక. కలియుగంలో ధర్మం ఒంటిపాదంపై నడుస్తుందనటానికి నిదర్శనంగా.. నంది ముందర కుడిపాదం పైకి లేచి ఉండగా.. మిగిలిన మూడూ లోపలికి మడిచి కనిపిస్తాయి. సంధ్యాసమయాన్ని ఆధ్యాత్మిక పరిభాషలో ప్రదోష కాలంగా చెబుతారు. ఈ సమయంలో నందికి విశేష అర్చనలు, పూజలు చేయడం సంప్రదాయం. కాలకూట విషం తాగిన పరమేశ్వరుడు తాండవం చేస్తుంటే, ఆయన ఉగ్రత్వాన్ని నేరుగా చూడలేని దేవతలు భయపడిపోయారు. అప్పుడు నంది వెనుక నిలబడి కొమ్ముల మధ్యలోంచి నటరాజును దర్శించారని పురాణ కథనం. నేటికీ అదే ఆనవాయితీని కొనసాగిస్తూ.. భక్తులు నంది కొమ్ముల మధ్యలోంచే స్వామిని దర్శించడం సంప్రదాయంగా వస్తోంది. ఎంతో మాహాత్మ్యం కలిగిన నందీశ్వరుణ్ణి..

తీక్ష శృంగాయ విద్మహే వేదపాదాయ
ధీమహి తన్నో నందిః ప్రచోదయాత్
అని ప్రార్థించి ప్రసన్నం చేసుకుంటారు.

**శివదేవుడి సంహార రూపాలు**

మహాశివుడి అనుగ్రహ రూపాలే కాదు, సంహార రూపాలు కూడా ఆరాధ్యనీయాలే! మహేశ్వరుడు జలంధర వధమూర్తి, త్రిపుర సంహారమూర్తి, మన్మథ సంహారమూర్తి, గజ సంహారమూర్తి, కాల సంహారమూర్తి- అనే ఐదు సంహార రూపాలు దాల్చాడు. జలంధరుడు శివుడి మూడో కన్ను నుంచి పుట్టాడు. అమిత గర్వంతో దేవతలను సైతం హింసిస్తుంటే శివుడే చక్రాయుధంతో జలంధరుణ్ణి సంహరించాడు. అప్పుడు జలంధరుడి నుంచి ఒక జ్యోతి బయటకు వచ్చి స్వామి మూడో నేత్రంలో ఐక్యమైంది. ఆ స్వరూపమే జలంధరహరమూర్తి రూపం. తారకాసురుడి కుమారులైన తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలిలు గాలిలో ఎగిరే మూడు నగరాలను బ్రహ్మ నుంచి వరంగా పొందారు. ఆ వరంతో మూడు పురాలనూ ఇష్టారాజ్యంగా లోకాలన్నీ తిప్పుతూ ప్రజల్ని అసౌకర్యానికి గురిచేయసాగారు. దాంతో దేవతలు పరమేశ్వరుని ఆశ్రయించగా.. ఆ స్వామి అభయమిచ్చాడు. త్రిపురాసుర సంహారానికి భూమి రథం కాగా, సూర్యచంద్రులు రథచక్రాలయ్యారు. బ్రహ్మదేవుడు సారథ్యం వహించగా, నాలుగు వేదాలు నాలుగు గుర్రాలుగా మారాయి. మేరు పర్వతం ధనుస్సుగా రూపొందగా, ఆదిశేషుడు విల్లు తాడయ్యాడు. విష్ణువే బాణమయ్యాడు. ప్రళయ కాలాగ్ని కీలలు ఆకాశమంతా నిండుతుండగా పరమేశ్వరుడు బాణాన్ని వదిలి త్రిపురాల్లోని రాక్షసులను సంహరించాడు. తన తపస్సును భగ్నం చేసేందుకు ప్రయత్నించిన మన్మథ సంహరణ మనందరికీ తెలిసిందే! ఇక మహిషాసురుడి పుత్రుడైన గజాసురుడు బ్రహ్మ కోసం తపస్సు చేసి, కామాన్ని జయించినవాని చేతిలో తప్ప మరెవరి చేతిలో మరణం లేకుండా వరం కోరుకున్నాడు. తుదకు కామదహనుడైన కాశీనాథుడు గజాసురుణ్ణి తుదముట్టించాడు. యముడు ప్రాణాలు తీసుకునేందుకు రాగా.. శివలింగాల్ని ఆలింగనం చేసుకొని బాలభక్తుడైన మార్కండేయుడు ఆర్తిగా ప్రార్థించాడు. అప్పుడు నీలకంఠుడు కాల సంహారమూర్తి రూపమెత్తి యముణ్ణి సంహరించాడు. ఈ ఎనిమిది రూపాలే కాకుండా ఈశ్వరుడు అనేక స్థితుల్లో అనుగ్రహిస్తాడు. అందుకే శివతత్త్వాన్ని కొనియాడుతూ 'శివుడు సమాధి స్థితుడై మహాయోగంలో ఉన్నప్పుడు ఆత్మారాముడిగా విరాజిల్లుతుంటాడు. ఆ స్థితి నుంచి దిగివచ్చేటప్పుడు స్వల్పంగానూ 'నేను' అన్న భావం ఉన్నప్పుడు 'రామ రామ' అంటూనూ నృత్యం చేస్తాడు' అనేవారు శ్రీరామకృష్ణ పరమహంస.

## పంచాంగం

ఆదివారం 9-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. దశమి ఉ. 7.46 |
| నక్షత్రం | : పునర్వసు రా. 11.55 |
| వర్జ్యం | : ప. 11.42 ల 1.20 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫొటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# ఘనంగా మహిళా దినోత్సవం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పట్టణంలోని భీమునిగుమ్మం జీవీఎంసీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో శత శాతం ఫలితాలు సాధించడంతో పాటు, పాఠశాల అభివృద్ధి, విద్యాభివృద్ధి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఎం. రాజ్యలక్ష్మి ని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు, ఉప విద్యాశాఖ అధికారి పాన్నాడ అప్పారావు, పరీక్షలు విభాగం సహాయ కమిషనర్ ఎ. శ్రీధర్ రెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు రామలింగేశ్వర రావు, ఏ ఎస్ ఓ వెంకటేశ్వరరావు, సీనియర్ మండల విద్యాశాఖాధికారి సి.ఆర్.కే దేవరాయలు, ఓపెన్ స్కూల్ ఇన్చార్జ్ పెనుమత్స కృష్ణంరాజు, ఉపాధ్యాయ సంఘ నాయకుడు తుంపాల వెంకటరమణ తదితరులు సత్కరించారు.

# పెట్రోల్ బంక్ నిర్మాణం ఆపండి

## ఎంపీ సీఎం రమేష్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి పట్టణంలో ఉన్న డీసీఎంఎస్ ఆవరణను అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిసిఎంఎస్ ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటును గత వైసిపి ప్రభుత్వంలో ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినప్పటికీ అనుమతించి ప్రభుత్వ స్థలంలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం సరికాదని దీని నిర్మాణాన్ని వెంటనే ఆపివేయాలని సిఎం రమేష్ అధికారులను ఆదేశించారు. ఇది ప్రభుత్వ స్థలమని ఇందులో ప్రైవేటు వ్యక్తులు బంకును ఏర్పాటు చేయడం సరికాదని తెలియజేశారు. ఈ స్థలంలో ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తామని, దీనిపై కూటమి నాయకులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తీసుకుంటామని సీఎం రమేష్ తెలియజేశారు.

# శ్రీనివాస కళ్యాణం చూతము రారండి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- సోమవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా అనకాపల్లి విజయరామరాజుపేట లో నిర్వహించే శ్రీ అలమేలుమంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన కరపత్రాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భీమర శెట్టి శ్రీనివాసరావు (సిల్క్ భవాని) ప్రతి సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా స్వామివారి కల్యాణ మహోత్సవం అతి వైభవంగా మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో నిర్వహించడం జరుగుతుందని. రత్నాకర్ కి తెలియజేశారు. ఈ కార్యక్రమం శిలపరసెట్టి బాబి,పలకా కాసులు,యల్లపు శ్రీనివాస్,దాడి ఈశ్వరరావు, దొడ్డి రమణ, రేబాక ఇంద్ర కుమార్, కొణతాల వాసు, సూరిశెట్టి బంగారు నాయుడు, కే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా

## విద్యార్థినులకు అవగాహన



పాయకరావుపేట, (విశాఖ సమాచారమ్):- పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి విద్యార్థులకు అనకాపల్లి జిల్లా ఎస్.పి తుహిన్ సిన్హా మరియు నర్సీపట్నం ఎస్.డి. పి ఓ పి. శ్రీనివాసరావు సూచనలు మేరకు శుక్రవారం విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాయకరావుపేట ఎస్. హెచ్.ఓజి.అప్పన్న మరియు తన సిబ్బంది పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు,దంగల్ మూవీ ను ప్రదర్శించి వాళ్లలో చైతన్యం కలిగేలా ఉన్న చిత్రాన్ని ప్రదర్శిమాం చేశారు. పోలీసులు విద్యార్థులకు తగు సూచనలు, చట్టాలపై అవగాహనా కల్పించ్చారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళా సాధికారత



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా తెలుగింటి ఆడపడుచులు, మాతృ సమానమైన మహిళలకు అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి మహిళా సాధికారత కోసమే నాడు కీర్తిశేషులు నందమూరి తారక రామారావు నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరకు పనిచేస్తున్నారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు మహిళా దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ కాదని సమాజ బాధ్యతగా గుర్తించాలని అన్నారు. 1995 లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత జాతీయ స్థాయిలో సంస్కరణలు తీసుకొని వచ్చిన తర్వాత సమాజంలో మహిళలు ఆర్థికంగా మగవాళ్లతో సమానంగా ఉండే విధంగా డ్వాక్రా వ్యవస్థని తీసుకొని వచ్చి ప్రతి మహిళను తన కుటుంబాన్ని పోషించుకునే విధంగా ఆర్థికంగా సహాయపడ్డారని, నేడు ప్రతి మహిళ బ్యాంకుల నుండి లక్ష రూపాయలు రుణాలు తీసుకొని చెల్లిస్తున్నారని, బ్యాంకులకు నూటికి నూరు శాతం రికవరీ మహిళల వల్లే జరుగుతుందని వెంకటరావు అన్నారు. 4 వ సారి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2025 -26 మహిళా శిశు సంక్షేమానికి 4,332 కోట్లు కాటేయించారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దీపం పథకం ద్వారా 90 లక్షల పైబడి లబ్ధిదారులకు సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారని, అలాగే ఆశా వర్కర్లు కు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మొదటి రెండు ప్రసవాలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రస్తుత సెలవు, గరిష్ట వయోపరిమితి 60- 62 ఏళ్లకు పెంపు, నిబంధనల ప్రకారము గ్రాట్యుటీ, ప్రతి నెల 10,000 రూపాయలు వేతన%శీ%, గ్రాట్యుటీ కింద సుమారు 1.5 లక్షలు అందించే అవకాశం, దీని ద్వారా 42, 752 మంది ఆశా వర్కర్లకు లబ్ధి చేకూరుతుందని వెంకటరావు అన్నారు. మరో ఎన్నికల హామీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్లకు రిటైర్మెంట్ వయసు 60 నుండి 62 సంవత్సరాలకు పెంచారని, రిటైర్మెంట్ తర్వాత గ్రాట్యుటీ పెంపు, అంగన్వాడీ హెల్పర్లకు 1 లక్ష రూపాయలు వర్కర్స్ కు 40,000 గ్రాట్యుటీ చెల్లింపు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకారం ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకు కానుక ప్రకటించారని, గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ పాలలో అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, హెల్పర్లు, అనేక ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వం నిర్బంధంగా వారి హక్కులను హరించి, అక్రమ కేసులు పెట్టి వేధించారని, నాడు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి, ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం నేడు వారందరికి కూటమి ప్రభుత్వం న్యాయం చేసిందని వెంకటరావు అన్నారు. ఈ కార్యక్రమంలో కొట్ని ఉమా, టౌన్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాయల ప్రసన్నలక్ష్మి ఎస్సీ సెల్ పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు కూరాకుల భారతి ఎస్సీ నాయకురాలు లక్ష్మీ ప్రభ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మోసపూరిత విధానాలను వ్యతిరేకించండి




అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):- అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 8 నుండి 14 వరకు రాష్ట్రవ్యాపితంగా ప్రజా పోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ రోజు సిపిఎం జిల్లా సెంటర్ శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్టీసి కాంప్లెక్స్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి కె.ఈశ్వరరావు మాట్లాడుతూ కూరగాయలు, నిత్యావసర వస్తువులు, వంటనూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశకు గురవుతున్నది. డిఎస్సీ వాయిదా పడిరది. గ్రూప్ 1, గ్రూప్ 2 అగమ్యగోచరంగానే ఉన్నాయి. కోచింగ్‌లు తీసుకున్న యువత అయోమయంలో ఉన్నారు. వెంటనే రిక్రూట్‌మెంట్ ప్రారంభించి ఉద్యోగాలు,ఉపాధి కల్పించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో 20 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై వేయడాన్ని తీవ్రంగా ఖండిరచారు. ట్రూఅప్ ఛార్జీల పద్ధతిని, స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ 6 సహా అన్ని ఎన్నికల వాగ్దానాలతో పాటు గత ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం చేసిన వాగ్దానాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ, ఎస్ఇజెడ్‌ల్లోని పరిశ్రమల్లో తరుచు ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రమాదాల నివారణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పించాలి. రైతులు పండిరచిన పంటలకు సోమినాధన్ కమీషన్ సిపార్సులకు అనుగుణంగా పెట్టుబడికి 50శాతం అధనంగా కలిపి గిట్టుబాటు ధర కల్పించాలని, మూసివేసిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి ఆధునీకరించాలి.

విశాఖ ఉక్కు పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వ నాన్చుడు వైఖరి రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలిగిస్తుంది. తక్షణం కార్మిక సంఘాలను పిలిచి చర్చించి కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవైపు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా మార్గాలు ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రి చెబుతుంటే కేంద్రం మాత్రం అమ్మి వేసేలా తన పని తాను చేసుకుపోతోంది. తెలుగుదేశం, జనసేనలు అమ్మకం జరగదని, ఆగిపోయిందని హామీ, భరోసా మాత్రం ఇవ్వ లేకపోతున్నాయి. ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును తిరిగి పోరాడి కాపాడుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంల సిపిఎం సీనియర్ నాయకులు గండి నాయనబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, శాఖ సభ్యులు ఎస్.నాగరమణ, పాంగి చలపతి, ఎం.రమణ, నాగిరెడ్డి సత్యన్నారాయణ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# జనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- జనరిక్ మందుల వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశంలో ఏటా మార్చి 7న జన్ ఔషధీ దివస్ ను ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గం పరవాడ దీపాంజలి నగర్ దగ్గర ఉన్న ఎన్టిపిసి షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్న ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రం జనరిక్ మెడికల్ షాప్ ను అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది ప్రజల ఆరోగ్య ఖర్చులను తగ్గించడంలో ఔషధీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు.ప్రస్తుతం భారత్లో పదిహేను వేలకు పైగా జనరిక్ ఔషధి కేంద్రాలు ఉండగా.వాటి ద్వారా 2000 కంటే ఎక్కువ రకాల మందులు, 300 శస్త్ర చికిత్స ఉత్పత్తులను తక్కువ ధరలకు ప్రజలకు అందిస్తున్నారు అని పేర్కొన్నారు అదే విధంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మరికొన్ని కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఉన్నతమైన బ్రాండ్ గల మందులను దాదాపు 50 శాతం నుండి 90 శాతం రాయితీతో ఈ కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్లు సానిటరీ నాప్కిన్ కేవలం ఒక్క రూపాయికే మహిళలకి లబ్ధి చేకూరేలాగా దేశంలో ఇప్పటికే కొన్ని మిలియన్ల సానిటరీ నాప్కిన్ లను అందజేశారని పేర్కొన్నారు.ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన ద్వారా నిర్వహించే ఈ ఔషధ కేంద్రాలకు మరింత ప్రాచుర్యం జరిగేలా సామాన్యులకి దీని యొక్క ఆవశ్యకతను తెలియజేసే కార్యక్రమాలు చేపట్టాలని స్థానిక నాయకులకు పిలిపునిచ్చారు.ఈ సందర్భంగా ఔషధీ కేంద్రాల గురించి ప్రత్యేక కథనాలు ప్రచురించాలి అని మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్టిపిసి సిజిఎం సమీర్ శర్మ బిజెపి రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ ,బీజేపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ,తెలుగుదేశం రాష్ట్ర నాయకులు బండారు అప్పలనాయుడు స్థానిక కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర డీజీపీని కలిసిన గొలగాని

బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- అమరావతి లో పోలీస్ ప్రధాన కార్యాలయం లో ఉమ్మడి విశాఖ జిల్లా యాదవ యువజన అధ్యక్షులు మళ్ళాం మాజీ సర్పంచ్ యువ న్యాయ వాది గొలగాని శ్రీనివాస్ యాదవ్, పోలీస్ బాస్ హరీష్ కుమార్ గుప్తాను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాన నగరం అయినా విశాఖ లో మాధక ద్రవ్యాలు గంజాయ్, కోకోన్, అరికట్టి ప్రభుత్వం కు ప్రజలు కు మంచి పేరు తేవాలని విజ్ఞప్తి చేసారు. అలాగే మహిళా భద్రత కు కూడా నిత్యం నిగా ఏర్పాటు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

# మంత్రులకు శుభాకాంక్షలు



పరవాడ, (విశాఖ సమాచారమ్):- విశాఖపట్నం విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ,జీల్లా ఇన్చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర , రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు , అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ , పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ,అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ లకు ప్రపంచ మహిళ దినోత్సవ సందర్భంగా శనివారం ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు ఆధ్వర్యంలో మహిళలు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమం లో రాష్ట్ర మత్స్యకార సమాఖ్య ప్రదానా కార్యదర్శి చింతకాయల ముత్యాలు ,ముత్యాలమ్మపాలెం ఎంపీటీసి అర్జిల్లి దేవిరవి, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపీటీసి చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు సమ్మంగి సోమేశ్వరరావు, చింతకాయల ముత్యాల నాయుడు, చింతకాయల తాతారావు ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

పరవాడ, (విశాఖ సమాచారమ్):- స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఎంపీడీవో ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ సందర్భంగా ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ఒక చెల్లిగా, అక్కగా, అమ్మగా, అత్తగా, అవ్వగా తన జీవితాంతం ఎన్నో సేవలందించిన స్త్రీ అని కొనియాడారు. వివిధ రంగాలలో మహిళలు సాధించిన కృషి, విజయాలను గుర్తించడానికి వారిని అభినందించడానికి ఈ దినోత్సవం ఒక ప్రత్యేక వేదిక అని చెప్పుకోవాలని గుర్తు చేశారు. నేటి సమాజంలో మహిళలు ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారనీ ,మహిళలపై జరుగుతున్న అన్ని రకాల వివక్షలను వదిలి, వారికి మగవారితో సమానంగా అవకాశాలు కల్పించాలని ఈ మహిళా దినోత్సవం సందర్భంగా కోరారు. ఒకప్పుడు మహిళలు ఇంట్లోంచి బయటికి వచ్చే పరిస్థితి ఉండేది కాదు , కానీ నేడు మహిళలకు విద్య అందడంతో పాటు, ఓటు హక్కు, ఉద్యోగాలు చేసే అవకాశాలు ఏర్పడ్డాయి అని పేర్కొన్నారు. అలాగే అంతరిక్షాన్ని తాకుతున్న స్త్రీలు కూడా ఉన్నారని గుర్తు చేశారు. ఉత్తమ డ్వాక్రా ఓం గణపతి గ్రూప్ సభ్యులకు ఎంపీపీ చేతుల మీదుగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పి. ఎస్ రాజు , రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు, సూపరిండెంట్ రాంబాబు, ఎ పి ఎం రంగారావు, డ్వాక్రా వి.ఓ.ఎ లు , డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకుడు లగుడుకు డాక్టరేట్ ప్రదానం




కే.కోటపాడు, (విశాఖ సమాచారమ్):- విశాఖకు చెందిన ప్రముఖ సామాజిక, పర్యావరణ సేవకులు, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు లగుడు గోవిందరావు గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి సంగ్రాలయంలోని నెహ్రూ ఆడిటోరియంలో పలువురు పార్లమెంటు సభ్యులు మేధావులు, ప్రముఖ బాలీవుడ్ సెలబ్రిటీల సమక్షంలో వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ కమీషన్ న్యూఢిల్లీ వారు లగుడు గోవిందరావు గత 15ఏళ్లుగా వివిధ రూపాలలో అందిస్తున్న సేవలను గుర్తించి దుశ్శాలువా కప్పి డాక్టరేట్ ను ప్రధానం చేసారు. ఈయన రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా,ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షులుగా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా, లగుడు ఫౌండేషన్ మరియు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ గా అనేక సామాజిక ఉద్యమాలు, కమ్యూనిటీ ఉద్యమాలు, మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు, కాలుష్య కారక పరిశ్రమల పోరాటాలు,సామాజిక పరమైన చైతన్య సదస్సులు వంటి అనేక అంశాలను పరిగణన లోకి తీసుకున్న వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ కమీషన్ న్యూ ఢిల్లీ వారు లగుడు గోవిందరావుకు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం ఘనంగా సత్కరించారు. ఈయన సేవలను గుర్తించిన అనేక సంస్థలు ఇప్పటికీ నాలుగు గౌరవ డాక్టరేట్ లను ప్రధానం చేయగా తాజాగా న్యూ ఢిల్లీ వారు ఐదో డాక్టరేట్ ను ప్రధానం చేయడం పట్ల పలువురు ఎంపీలు ఎమ్మెల్యేలు, విశాఖ వాసులు అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



**పాయకరావుపేట, (విశాఖ సమాచారమ్):-** మండలంలోని గుంటపల్లి, మంగవరం, కేశవరం, రాజవరం పంచాయతీల్లో డోర్ టు డోర్ తడి చెత్త పొడి చెత్త సేకరణ అవగాహన కార్యక్రమం ఈ ఓ ఆర్ డి చంద్రశేఖర్ రావు నిర్వహించారు. ఆయా గ్రామాలలో శానిటేషన్ పనులు చేపట్టారు.చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు సైన్ బోర్డులు, తడి చెత్త పొడి చెత్త సేకరణ పై ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు చేయవలసిందిగా సంబంధిత పంచాయతీ కార్యదర్శిలకు తెలియజేయడమైనది. గ్రామ పంచాయతీ హౌస్ టాక్స్ వంద మార్చి 2025 నాటికి వసూలు చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. రాజవరంలో ఎస్వపిసి షెడ్ పరిశీలించడం అయ్యింది.ఈ కార్యక్రమంలో రాజవరం సర్పంచ్ పీస్ స్ సునీత, కొండరావు, సత్యనారాయణ, వీరకృష్ణ,మూడు సచివాలయం స్టాఫ్, హరిత రాయబారులు పాల్గొన్నారు.

## మహిళా నిరుద్యోగ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలిగా రాజాన సరోజిని



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):-** నవ్యాంధ్రప్రదేశ్ నిరుద్యోగ మహిళ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలుగా రాజన సరోజినీ సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సరోజినీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మహిళలకు నిరుద్యోగులకు అవగాహన కల్పించి సమావేశాలు ఏర్పాటు చేసి వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దుటకు కృషి చేయడం జరుగుతుందని తద్వారా మహిళలకు చైతన్యం కార్యక్రమంలో ముందుండి నడిపించడం జరుగుతుందని తెలిపారు. నాకు ఈ అవకాశం కల్పించిన ఎస్ కుమార్ కి సంఘ సభ్యులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూన్నని చెప్పారు. ఈ బాధ్యతను పూర్తిగా నిస్వార్థంతో సేవ చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):-** మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి, తమదైన శైలిలో దూసుకుపోతున్నారని చింతపల్లి మండల విద్యాశాఖాధికారులు పి ప్రసాద్ ,బోడం నాయుడు అన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో పలు సాంస్కృతిక మరియు ఆటలు పోటీలు ఘనంగా నిర్వహించారు.. మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిని అధిగమించేందుకు కృషి చేయాల్సి ఉందన్నారు . ఇందులో భాగంగా స్థానికంగా మహిళ ఉపాధ్యాయులకు సాంస్కృతిక మరియు ఆటలు పోటీలు నిర్వహించారు ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు అందజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా టిఆర్టియు అధ్యక్షులు యువిగిరి ఎస్టీయూ అధ్యక్షురాలు రెడ్డి వరలక్ష్మి , పిఆర్టియు స్టేట్ కౌన్సిల్ కే మచ్చలింగం టిఆర్టియు మండల అధ్యక్షులు కే సంజీవరావు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటరమణమ్మ ఉత్తర కుమారి యశోద కృష్ణకుమారి. కే.గిరిజ. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పి ఆర్ టి యు మహిళా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది.

# మహిళలకు కలెక్టర్ శుభాకాంక్షలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా జిల్లాలోని మహిళలందరికీ జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళ జీవితంలో ప్రతి రోజు పండుగ కావాలని ఆకాక్షించారు. సమాజంలో ప్రతి మహిళ వారి కోరికలు, లక్ష్యాలను నెరవేర్చుకొనేలా కుటుంబ సభ్యులు సహాయపడాలని, చదువు, ఉద్యోగాలలో వారిని ప్రోత్సహించాలని కోరారు. నేడు అన్నిరంగాలలో మహిళలు ముందుంటున్నారని, రాజకీయ, విద్య, న్యాయ, వైద్య, రక్షణ, పరిపాలనా, శాస్త్రసాంకేతిక రంగాలలో ఉన్నత పదవులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, కళలు, ఆటలు, పారిశ్రామిక, వ్యవసాయం వంటి అనేక రంగాలలో ఉన్నతంగా రాణిస్తున్నారని తెలిపారు. ప్రతి బాలికకు విద్యను అందించాలని, మహిళకు ఉన్నత స్థానాన్ని ఇవ్వాలని, వారి మాటకు గౌరవాన్నివ్వాలన్నారు. మహిళను గౌరవించిన సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టరు తెలిపారు.

# శ్రీనివాసుని వార్షిక కళ్యాణ శుభ పత్రిక ఆవిష్కరణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఈనెల 10వ తేదీన అనకాపల్లి పట్టణం దేమునిగుమ్మం శ్రీ స్వయంభు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం శుభ పత్రిక ను ధర్మకర్తల మండలి చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ ఈవో టి రాజసులోచన, దేవాలయం అర్చకులు పులఖండం గిరిబాబు కరపత్రం ఆవిష్కరించారు.

తొమ్మిదో తేదీ రాత్రి 7 గంటలకు సంకల్పం.

10 తేదీ ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం స్వామి వారిని ఊరేగింపుతో వెళ్లి మల్లవరపు వారి వీధిలో ఎదురు సన్నాహం రాత్రి 8-30 నిమిషములకు కళ్యాణ మహోత్సవం.

11 వ తేదీ స్థాలీపాకం12 వ తేదీ ఉదయం 6:30 నుండి సాయంత్రం 6:30 వరకు అర్ధ ఏకాహం సదస్య మహోత్సవం13 వ తేదీ గరుడ వాహన సేవ అనకాపల్లి పురవీధులలో స్వామివారి ఊరేగింపు చోర సంవాదం 14వ తేదీ 9 గంటలకు ధ్వజావరోహణం సాయంత్రం 7 గంటలకు డోలోత్సవం15 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన సాయంత్రం 6 గంటలకు ద్వాదశకలశార్చన సప్త ప్రాకార సేవ పుష్పయోగోత్సవం, దర్పణ దర్శనం, జరుగును

కరపత్రం అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ ఆధ్వర్యంలో దేవాలయం ప్రధాన అర్చకులు పుల ఖండం గిరిబాబు సతీమణి నాగిని రమ కి ఎగ్జిక్యూటివ్ అధికారి టి రాజసులోచన కి మహిళా ధర్మకర్తలకు సత్కారం చేసి శుభాకాంక్షలు అందజేశారు..ఈ కార్యక్రమంలో పులకండం ప్రసాద్ బాబు ధర్మకర్తలు గోలి మురళి, సిహెచ్ నూకరాజు, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, సోమాదుల తులసి, తదితరులు పాల్గొన్నారు

# సీపీఎం ప్రజా చైతన్య యాత్ర ప్రారంభం



**రాంబిల్లి, (విశాఖ సమాచారమ్):-** ప్రజల కోసం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా స్థానిక సమస్యలపై ఈరోజు తిమ్మరాజుపేట గ్రామంలో వీధుల్లో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలు అడిగి సిపిఎం బృందం తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు చెప్పిన సమస్యలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఈ గ్రామంలో ప్రారంభం చేయక పోవడం వలన కూలీలకు పనులు లేకుండా ఇబ్బందులు పడుతున్నామని, రజకులు వృత్తి చేసుకోవడానికి ధోబికాన నిర్మించాలని, నిరుప యోగ్యంగా ఉన్న నుయ్యి వలన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందని భయాందోళనకు గురవుతున్నామని నుయ్యి ఎత్తు పెంచి గ్రిల్స్ తో పైకప్పు రక్షణ వలయం నిర్మించాలని, రజక కాలనీలో రోడ్డు నిర్మాణం చేయాలని, కౌలు రైతులకు రుణాలు, రైతు పథ కాలు అందజేయాలని, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెండింగ్లో ఉన్న ఇల్లు బిల్లులు మంజూరు చేయాలని, గత సంవత్సరంలో పనిచేసిన ఐదు మంది ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వలేదని, ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న పథకాలు 1500, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం లాంటి పథకాలు ఇస్తే బాగుంటుందని, కరెంటు చార్జీలు తగ్గించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్. రాము మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన సమస్యలపై కార్యచరణ రూపొందించి భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సిద్ధం చేస్తామని వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్రి. అప్పారావు, తిమ్మా రాజుపేట శాఖ కార్యదర్శి ఎస్. రామ్ నాయుడు, మండల కమిటీ సభ్యులు కే. సోమినాయుడు, నూకరత్నం, అప్పల నర్స, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవం

## స్త్రీలు వారి జీవితానికి సంబంధించిన నిర్ణయాలు వారే తీసుకోవాలి : జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** స్త్రీలు వారి జీవితానికి సంబందించిన నిర్ణయాలు వారే స్వతంత్రంగా తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవరం సంధర్భంగా శుక్ర వారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో రెవిన్యూశాఖకు చెందిన మహిళా ఉద్యోగులు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా హాజరైన జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాలలో ముందుంటున్నారని, ఉద్యోగ బాద్యతలతో పాటు కుటుంబ బాద్యతలు కూడా నెరవేర్చవలసి ఉంటుందన్నారు.ఈ పరిస్థితులలో పిల్లల పట్ల చాలా బాద్యతగా వ్యవహరించాలని తెలిపారు. మహిళలు, పిల్లలకు రక్షణ కల్పించవలిన బాద్యత మనందరిపై ఉందన్నారు.పిల్లల రక్షణకు కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు మానశికంగా, ఆరోగ్యంగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలు పెంపకంలో తల్లితోపాటు తండ్రికూడా బాద్యత తీసుకోవాలని తెలిపారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవని, పిల్లలకు రక్షణ, మానసిన వికాసం ఉండేవని, కాని నేడు పిల్లలు ఎవరితో కలువకుండా ఒంటరిగా ఉంటున్నారని ఆ ప్రభావం భవిష్యత్తులో వారి జీవితంపై ప్రభావం చూపిస్తుందని తెలిపారు. అందువలన ప్రతి ఒక్కరు వారి కుటుంబం, బందువులతో అప్యాయత, అనురాగాలతో ఉండాలని పిల్లలను వారితో ఉండేలా కలిసి ఉండేలా చూడాలన్నారు. ఉద్యోగరీత్యా ఇతర ప్రదేశాలలో పనిచేస్తున్న వారు తోటి వారిని కుటుంబ సభ్యులుగా భావించాలని వారితో మంచి సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మహిళలు వారి పని ప్రదేశాలలో చక్కని స్నేహపూర్వత వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. పిల్లలు, స్త్రీల పట్ల తప్పుగా ప్రవర్తించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి మాట్లాడుతూ ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థానానికి చేరిన మహిళా అధికారులు జీవితాలను స్పూర్తిగా తీసుకోవాలన్నారు. గతంలో కుటుంబాలలో స్త్రీ పాత్ర వేరుగా ఉండేదని, కుటుంబ బాద్యతలవరకు పరిమితమై ఉండేదన్నారు. కాని ప్రస్తుతం మహిళల జీవితాలలో ఎన్నో మార్పులు వచ్చాయని కుటుంబ బాద్యతలతో పాటు, వృత్తిలో కూడా రాణిస్తున్నారని తెలిపారు. అటువంటి పరిస్థితులలో పిల్లలు పెంపకంలో తల్లికి వారి తండ్రలుకూడా సహకరించాలని, అప్పుడు మాత్రమే స్త్రీ తమ బాద్యతల నిర్వహణలో పూర్తిగా విజయవంతమవుతుందని తెలిపారు. మహిళా దినోత్సవరం శుక్రవారం ఉదయం సంధర్భంగా ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు.జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్,జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం ఎస్.పి. కార్యాలయం ప్రక్కన గల ఫ్యూచర్ వరల్డ్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆటల పోటీలలో త్రోబాల్, షాట్ పుట్, డిస్క్ త్రో, కేరమ్స్, చదరంగం, నడక, టెన్నికాయిట్, మ్యూజిక్ చైర్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు. జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ కొన్ని ఆటలలో విజేతలుగా నిలిచారు.ఈ కార్యక్రమంలో భాగవతుల శిరీషారాణి, శ్రీసాయి నాట్య భారతి అకాడమీ వారి విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు మెమెంటోలు, బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి, రెవిన్యూ డివిజనల్ అదికారి షేక అయిషా, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు సుబ్బలక్ష్మి, రమామణి,మనోరమ, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి బి.వి.రాణి ఇతర అదికారిణులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### సీపీఎం డిమాండ్




**వి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** మండలం శంకరం పంచాయతీలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కూటమి ప్రభుత్వ ఇచ్చిన హమిలు అమలు చేయాలని ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. మాడుగుల మండలంలో శంకరం పంచాయతీలో జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి పాల్గొని మాట్లాడరు. ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవ సందర్భంగా. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాకముందు మహిళలకు అనేక వాగ్దానాలు సంక్షేమ పథకాలు స్కీములు అమలు చేస్తామని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం 18 సంవత్సరాలు నిండిన మహిళకు నేలకి 1500 రూపాయలు తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు ఇస్తామని హామీలు ఇచ్చారు ఆ హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ%శి% పై మహిళలు రాష్ట్రంలో ఉన్న ప్రజలు సంక్షేమ పథకాలు ఇస్తారని ఎదురు చూస్తున్నారని దళితులు గిరిజన మహిళలపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు మహిళ దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వ ఇచ్చినహమిలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిన్నెపల్లి దేవుడమ్మ. సొలం దేవుడమ్మ. కాసిన ఎర్రయమ్మ. సోలం చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

### మహిళా పోలీసులకు ప్రతిభా పురస్కారాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ శ్రీమతి ఎం. జాహ్నవి, మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రొజెక్టు డైరెక్టరు శ్రీమతి కె.అనంతలక్ష్మి వారి ఆధ్వర్యంలో అనకాపల్లి పట్టణం, పెంటకోట కన్వెన్షన్ హాల్లో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విధులలో ప్రతిభ కనబరిచిన మహిళా పోలీసు అధికారులకు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, అనకాపల్లి ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సీ.ఎం.రమేష్, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులకు పురస్కారాలు అందజేశారు.

ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నాయకత్వంలో విశేష సేవలు అందించిన 8 మంది మహిళా పోలీసులకు "ప్రతిభా పురస్కారాలు" ప్రధానం చేయడం గర్వకారణంగా నిలిచిందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. వీరిలో నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.రేవతమ్మ, అనకాపల్లి టౌన్ ఏఎస్సై ఆర్.లత, అచ్యుతాపురం పిసి బి.లక్ష్మి, రాంబిల్లి పిసి డి.సౌజన్య, కసింకోట పిసి బి.జయలక్ష్మి, నర్సీపట్నం టౌన్ పిసి ఎస్.జ్యోతి శ్రీ, పి.సి.ఆర్ పిసిలు జి.వి.సంధ్య, ఏ.రామలక్ష్మి ఉన్నారు.ఈ వేడుకలో మాట్లాడిన అధికారులు, ప్రజా ప్రతినిధులు మహిళా సాధికారితను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. మహిళా పోలీసుల సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత మంది మహిళలు పోలీస్ విభాగంలో చేరి సమాజ సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంను యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రజలకు మరింత సమర్థవంతంగా అమలు చేసే నిమిత్తం జిల్లాలోని కలెక్టరు కార్యాలయంతో పాటు, డివిజను, మండల, మున్సిపల్ కార్యాలయాలలో మరియు గ్రామసచివాలయాలలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించుటకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.కావున సోమవారం ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు తమ సమీప రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, మండల తహశీల్దార్ మరియు మునిసిపాలిటీ కార్యాలయంలతో పాటు గ్రామ సచివాలయాలలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మద్యాహ్నాం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకొనవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గినప్పుడే మరింత సంక్షేమం

- ఉద్యోగుల పని సంస్కృతి మెరుగు పడాల్సిన అవసరం ఉంది
- 38వ నిర్మాణాత్మక సమావేశంలో సీఎండీ బలరామ్



**హైదరాబాద్, విశాఖ సమాచారమ్:** పోటీ మార్కెట్లో నిలదొక్కుకోవాలంటే సింగరేణి బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గాల్సిన అవసరం ఉందని, అలా జరిగితే ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు మరిన్ని నూతన పథకాలను ప్రారంభించుకోవడానికి అవకాశం ఉంటుందని సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ అన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తో జరిగిన 38వ నిర్మాణాత్మక సమావేశంలో ఆయన మాట్లాడారు.

సింగరేణి సంస్థ బొగ్గు అమ్మకం ధరలు కోల్ ఇండియా ధరల కన్నా, విదేశీ బొగ్గు ధరతో పోల్చితే ఎక్కువగా ఉంటున్నాయని, కనుక మన బొగ్గుకు క్రమంగా డిమాండ్ తగ్గుతోందని, ఇది చాలా ఆందోళనకరమని పేర్కొన్నారు. భూగర్భనుల్లో ఉత్పత్తి వ్యయం టన్నుకు 12 నుంచి 16 వేల రూపాయలకు చేరుకుంటుందన్నారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే ఉద్యోగులు పూర్తి పని గంటలు సద్వినియోగం చేస్తూ యంత్రాలను పూర్తిగా వినియోగించాలన్నారు. గైర్హాజరీలు చేస్తున్న కార్మికులపై తీసుకునే కఠిన చర్యలకు సహకారం అందించాలని, తద్వారా క్రమశిక్షణను పెంచడం సాధ్యమవుతుందన్నారు. నాణ్యత పెంపుదలకు మరింత కృషి జరగాలన్నారు. ఈ అంశాలను సవాళ్లుగా స్వీకరించాలన్నారు. నేడు ప్రపంచం థర్మల్ విద్యుత్ నుండి సోలార్ విద్యుత్తు, ఇతర గ్రీన్ ఎనర్జీ విధానాల వైపు అడుగులు వేస్తోంది కనుక సింగరేణి సంస్థ కూడా తన మనుగడ కోసం సోలార్ విద్యుత్తు, కీలక ఖనిజాల ఉత్పత్తి వంటి వ్యాపార విస్తరణ చర్యలను చేపట్టాల్సి వస్తోందన్నారు. కార్మిక సంఘాలు కంపెనీ ఆర్థిక స్థితిగతులు అర్థం చేసుకొని కార్మికుల్ని చైతన్య పరచాలని. కంపెనీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధిలో కార్మికులు కీలకపాత్ర పోషిస్తుంటారని, కంపెనీ అభివృద్ధితోపాటు సంక్షేమానికి కూడా సమ ప్రాధాన్యతనిస్తే సింగరేణికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గతంలో సింగరేణి సంస్థను కష్టాల నుండి కాపాడడానికి కార్మికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఇప్పుడు కూడా కంపెనీని అగ్రస్థానంలో నిలపడానికి కార్మికులు తమ వంతు కృషి చేస్తారన్నారు. అయితే కేవలం కంపెనీ ఉత్పత్తిని మాత్రమే దృష్టిలో పెట్టుకోకుండా కార్మిక సంక్షేమానికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని రూపొందించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సింగరేణి ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని ఆయన కోరారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు.

సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ గుర్తింపు కార్మిక సంఘం ద్వారా వివరించిన సమస్యలపై చర్యలు తీసుకుంటామని, ఆర్థిక పరమైన సమస్యలపై కమిటీలు వేసి చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ లో సింగరేణి తరపున ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రతిపాదనకు ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. కార్మికులకు సొంత ఇంటి పథకం సాధ్యాసాధ్యాలపై ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్.వి. సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పి అండ్ పి), ఈడీ(కోల్ మూమెంట్) ఎస్ డి.ఎం.సుభానీ, జీఎం (పర్సనల్) ఐఆర్, పీఎం కవితా నాయుడు, జీఎంలు పాల్గొన్నారు. గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ తో పాటు వివిధ ఏరియా నుండి హాజరైన గుర్తింపు కార్మిక సంఘం ప్రతినిధులు అనేక ఉత్పత్తి సంబంధ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు.

**ఛైర్మన్ పని విధానానికి ప్రశంసలు**

ఈ సమావేశంలో పాల్గొన్న కార్మిక నాయకులు కొందరు మాట్లాడుతూ.. సంస్థ ఛైర్మన్ ఎన్. బలరామ్ ఎంతో సాదాసీదాగా కార్మికులతో కలిసిపోయి వారి సమస్యలు తెలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఒక ఛైర్మన్ గా కంటే కార్మిక నాయకునిగా కార్మికుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారన్నారు.. గతంలో కార్మికులు ఛైర్మన్ ని కలవడం అనేది ఎంతో అసాధ్యంగా ఉండేదని, అయితే శ్రీ ఎన్.బలరామ్ ను అందరూ కలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఆయన నిర్వహించిన చైతన్య యాత్రలో కార్మికులు నుండి అనేక సలహాలను ఆయన స్వయంగా విన్నారని, వీటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

# మహిళా దినోత్సవం నాడు మహిళల ఉగ్రరూపం

## వైన్ షాప్ బ్యానర్లు దగ్ధం



**తిరుపతి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం తిరుపతిలో మహిళలు ఉగ్రరూపం ప్రదర్శించారు. సాయినగర్ లో నివాస ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైన్ షాప్ వద్ద ఆందోళనకు దిగారు. బైరాగి పట్టెడ సీపీఐ కార్యాలయం నుంచి తొలుత మహిళలు ప్రదర్శనగా వైన్ షాప్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కొద్దిరోజులుగా ప్రజా సంఘాలు ఆందోళన చేస్తున్నప్పటికీ వైన్ షాప్ అక్కడే కొనసాగిస్తుండడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ క్రమంలో షాప్ బ్యానర్లు చించి వేసి దగ్ధం చేశారు. వైన్ షాప్ షట్టర్లు మూసి వేసి నిరసనకు పూనుకున్నారు. బ్యానర్లు దగ్ధం చేయరాదు అంటూ మహిళలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వైన్ షాప్ యజమానులకు పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మహిళలు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలకు రక్షణ కల్పించాలని, నివాసాలు, బ్యాంకులు, విద్యార్థుల హాస్టల్, ఆస్పత్రి మధ్య ఏర్పాటుచేసిన దుకాణాన్ని ఎత్తివేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## అంబేద్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా మెడికల్ క్యాంప్



**చోడవరం, (విశాఖ సమాచారమ్):-** నియోజకవర్గం లోని చోడవరం పట్టణంలో, కో-ఆపరేటివ్ కాలనీ శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు.350 హాజరయ్యారని సుమారు 6000 వరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచితంగా రోగులకు ఈ సి జి, రక్త పరీక్షలు బేబీ మరియు షుగర్ పరీక్షలు నిర్వహించారని తెలిపారు. దంత వైద్యులు, శ్రీ వైద్య నిపుణులు, ఎముకల వైద్య నిపుణులు ద్వారా వైద్యం అందరికీ ఉచితంగా అందించడం జరిగిందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ ట్రస్ట్ నిర్వాహకులు కండెల్లి వెంకటరావు, జింజోరి అప్పారావు వసంత పైడిరావు, భూపతి రాజు , ఎర్రంశెట్టి వరప్రసాద్ , వేచల్పు ప్రకాష్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గీతం మెడికల్ అండ్ సైన్స్ ఇన్స్టిట్యూట్ వారి సహకారంతో నిర్వహించడం జరిగిందన్నారు.

## అమ్మకు వందనం



సహనమే శక్తిగా వెలుగొందు నీవు,
సంతప్త హృదయమే వెలిగించు నీదు!
అరుణోదయమై అగ్నికన్యవై,
అశేష ప్రపంచాన నిలిచినావు!

తల్లి రూపమున ప్రేమను నింపి,
తరతరాలకు మార్గము చూపి,
అమ్మ వాక్యమై అక్షరమై,
అనుసంధానమెరుగైనది నీవు!

ప్రతి రోజున నీకు వందనములు,
ఎల్లపుడును నీకు గౌరవము!
ప్రపంచమంతా నీకు రుణపడి,
ప్రశంస గానం చేయును ఈ గాంధీ!

(మహిళా దినోత్సవం శుభాకాంక్షలతో..)
చప్పా గాంధీ, వాషింగ్టన్ (యూఎస్ఏ)



# సినిమా

## మహిళలు సాధించాల్సింది ఎంతో ఉంది: మాధురీ దీక్షిత్



ఐఫా వేడుకలకు జైపూర్ సిద్ధమైంది. ఇప్పటికే అగ్రతారలు అక్కడికి చేరుకున్నారు. తాజాగా ఆ వేడుకలో పాల్గొన్న మాధురీ దీక్షిత్ మహిళా దినోత్సవం సందర్భంగా సినీరంగంలో మహిళల పారితోషికాల్లో వ్యత్యాసంపై చర్చించారు. మహిళలు సాధించాల్సింది ఇంకా ఎంతో ఉందన్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత నిర్మాత గునీత్‌తో కలిసి 'ది జర్నీ ఆఫ్ సినిమా' సెషన్‌లో మాధురీ మాట్లాడారు.

సినిమాల్లో నటీనటుల వేతనాల గురించి మాధురీ ప్రస్తావిస్తూ.. "మహిళల విషయంలో వారు తమను తాము పదేపదే నిరూపించుకోవాల్సి వస్తోంది. మనం కూడా ప్రేక్షకులను అగ్ర హీరోల వలే ఆకర్షించగలం. కానీ, మనం దానిని ప్రతిసారీ నిరూపించుకోవాల్సి వస్తోంది. అలాగే పారితోషికం విషయంలోనూ ఇంకా అసమానతలు ఉన్నాయి. వాటిని అధిగమించాలి" అని చెప్పారు. నిర్మాత గునీత్ మాట్లాడుతూ.. "సినీరంగంలోని వేతన వ్యత్యాసం గురించి నటులు సమాధానం చెప్పాలని నేను కోరుకుంటున్నాను. మహిళలు ఇప్పటికే ఎన్నో అవకాశాలు కోల్పోయారు. మన అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. 'స్త్రీ2' లాంటి చిత్రాలు మరిన్ని రావాలి. అలాంటివి తెరకెక్కిస్తేనే మహిళలకు మరింత గుర్తింపు వస్తుంది" అని అన్నారు.

ఇక ఈ 'ఐఫా' వేడుకల్లో అమితాబ్ బచ్చన్ 'షోలే'కు అరుదైన గౌరవం దక్కనుంది. ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టులో 50ఏళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా జైపూర్ రాజ్‌మందిర్‌లో ప్రదర్శించనున్నారు. "2025 ఐఫా అవార్డులు కేవలం ఓ వేడుక మాత్రమే కాదు. 50వసంతాల షోలే ప్రయాణానికి గౌరవం. 'షోలే' అనేది కేవలం సినిమా మాత్రమే కాదు. ఇది ఒక ఎమోషన్. దీన్ని గౌరవించడానికి ఐదు దశాబ్దాలుగా సినీ ప్రేమికుల ఆదరాభిమానాలు దక్కించుకున్న రాజ్‌మందిర్ థియేటర్ కంటే మంచి వేదిక ఎక్కడుంది" అని ఐఫా సహ వ్యవస్థాపకుడు ఆండ్రీ టిమ్మిన్స్ అన్నారు.

## 'ఛావా' ఖాతాలో మరో రికార్డు.. వసూళ్లు ఎంతంటే



శంభాజీ మహారాజ్ జీవిత కథతో ప్రేక్షకుల ముందుకువచ్చి తన కెరీర్‌లోనే హిట్‌ను సొంతం చేసుకున్నారు బాలీవుడ్ హీరో విక్కీ కౌశల్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'ఛావా' రికార్డులు సృష్టిస్తోంది. ఫిబ్రవరి 14న విడుదలైన ఈ సినిమా అన్ని ప్రాంతాల్లో మంచి వసూళ్లను తన ఖాతాలో వేసుకుంటోంది. తాజాగా మరో ఘనత సాధించింది. అభిమానులు అనుకున్నట్లుగానే రూ.500 కోట్ల క్లబ్‌లో చేరింది.

ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ప్రజల హృదయాలను హత్తుకుంది. దీంతో 22 రోజుల్లోనే రూ.500 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. ఈ విషయాన్ని తెలుపుతూ బాలీవుడ్ ప్రముఖ విశ్లేషకుడు తరణ్ ఆదర్శ్ పోస్ట్ పెట్టారు. ఇప్పటివరకూ రూ.502 కోట్లకు పైగా వసూలుచేసినట్లు చెప్పారు. ఒక హిస్టారికల్ మూవీకి ఈ స్థాయిలో వసూళ్లు రావడం బాలీవుడ్ చరిత్రలో ఇదే తొలిసారి అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

టౌన్‌లో ఘన విజయాన్ని సొంతం చేసుకున్న 'చావా' సుమారు మూడు వారాల తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకువచ్చింది. గీతా ఆర్ట్స్ ఈ సినిమా తెలుగు అనువాదాన్ని మార్చి 7న విడుదల చేసింది. తొలిరోజు ఈ చిత్రం ఇక్కడ కూడా మంచి వసూళ్లు సొంతం చేసుకుంది. రూ.3 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టినట్లు సంస్థ తెలిపింది. ఒక అనువాద చిత్రానికి ఈ స్థాయిలో కలెక్షన్లు రావడం అరుదంటూ సోషల్ మీడియాలో ఈ సినిమాపై ప్రశంసలు కురిపిస్తున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ ఆయన భార్య యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక జీవించేశారు.

## 'సంక్రాంతికి వస్తున్నాం' 300.. 200.. 300.. రికార్డులివే




300.. 200.. 300.. ఇదేంటి క్రికెట్ స్కోరులా ఉందనుకుంటున్నారా? కాదండీ.. వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన 'సంక్రాంతి వస్తున్నాం' (%ఝుఅనితీఝుత్త్రఖనెఖ ఝుర్త్రబఞుఎ%) రికార్డులు. లార్జ్ దేన్ లైఫ్ సినిమాల హవా కొనసాగుతున్న ప్రస్తుత కాలంలో ఒక కామెడీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అటు బాక్సాఫీస్, ఇటు ఓటీటీలో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న దానికి ఉదాహరణ. మరి ఆ రికార్డులేంటో చూసేయండి.

300.. పెద్దగా అంచనాలేమీ లేకుండా ఈ ఏడాది సంక్రాంతికి కానుకగా వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వినోదాన్ని పంచడమే కాదు, ఫుల్‌రన్‌లో రూ.300 కోట్లకు పైగా వసూలు చేసింది. కేవలం తెలుగు భాషలోనే విడుదలైన మూవీ ఈ స్థాయి కలెక్షన్లు రాబట్టడం మామూలు విషయం కాదు.

200.. ఇక ఈ సినిమా విడుదలకు ముందే మరో విషయంలోనూ ఫుల్ ట్రెండ్ అయింది. అదే 'గోదారి గట్టు' సాంగ్. భీమ్స్ సిసిరోలియో స్వరాలు.. భాస్కర్ భట్ల తెలుగు పదాలకు తోడు, సంగీత దర్శకుడు రమణగోగుల వాయిస్ ఈ పాటకు మరింత ఊపు తీసుకొచ్చింది. రమణ గోగుల వాయిస్‌లో ఉన్న ప్రత్యేకత ఏంటో మిలీనియం కుర్రకారుకు బాగా తెలుసు. ఆయనతో ఈ పాట పాడించి నేటి యువత కూడా ఫిదా అయ్యేలా చేసింది చిత్ర బృందం. యూట్యూబ్‌లో విడుదలైన నాటి నుంచే ట్రెండింగ్‌లో ఉన్న ఈ పాట లిరికల్ వీడియో తాజాగా 200 మిలియన్ వ్యూస్‌ను దాటేసి రికార్డు సృష్టించింది.

300.. ప్రస్తుతం 'సంక్రాంతికి వస్తున్నాం' జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న సంగతి తెలిసిందే. తొలిసారి అటు టెలివిజన్ ప్రీమియర్‌గా, ఇటు ఓటీటీ స్ట్రీమింగ్‌కు ఒకేసారి తీసుకొచ్చి సరికొత్త ట్రెండ్‌ను సెట్ చేశారు. విడుదలైన 12 గంటల్లోనే 100 మిలియన్ వ్యూయింగ్ మినిట్స్ సాధించిన ఈ చిత్రం ఇప్పుడు 300 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌ను దాటేసి, రికార్డు సృష్టించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం సరికొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఇవే కాదండోయ్ ఇటీవల కాలంలో 90 సెంటర్స్‌లో 50 రోజులు పూర్తి చేసుకున్న చిత్రంగానూ నిలిచింది.

## టాలీవుడ్‌లోకి మరో బాలీవుడ్ బ్యూటీ ఎంట్రీ




తెలుగు చిత్రాల్లో నటించేందుకు వివిధ పరిశ్రమలకు చెందిన తారలు ఆసక్తి చూపిస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బాలీవుడ్‌కు చెందిన దీపికా పదుకొణె, జాన్వీకపూర్, అనన్యపాండే వంటి తారలు ఇప్పటికే తెలుగు సినిమాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. వీరి జాబితాలోకి ఇప్పుడు సోనాక్షిసిన్హా వచ్చి చేరారు.

విభిన్నమైన చిత్రాలతో బీటౌన్‌లో హీరోయిన్‌గా గుర్తింపుతెచ్చుకున్నారు సోనాక్షి సిన్హా. ఇటీవల 'హీరామండి'తో అలరించిన ఆమె టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. సుధీర్‌బాబు హీరోగా నటిస్తోన్న 'జటాధర'తో నటిగా ఆమె తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం శనివారం స్పెషల్ పోస్టర్ షేర్ చేసింది. ప్రస్తుతం ఇది సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా మూవీగా ఇది సిద్ధమవుతోంది. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతోంది. 'శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు' అని గతంలో ఈ ప్రాజెక్ట్‌ను ఉద్దేశించి సుధీర్ బాబు చెప్పారు.

# మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, వికలాంగులు & సీనియర్ సిటిజన్ సంక్షేమ శాఖ మాత్యులు మరియు జిల్లా ఇంచార్జి మంత్రి డా.డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం ఉదయం స్థానిక ఉడా చిల్డ్రన్ ఏరీనాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి మంత్రి డా.డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో విజయాలను సాధించిన మహిళలను గుర్తించి వారిని గౌరవించి, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రోత్సహించాలన్నారు. మహిళల హక్కులు, సమానత్వం, సాధికారత గురించి చర్చించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆడపిల్లలకు ఆస్తిలో సమాన హక్కు, విద్య, వృత్తి ఉద్యోగ రంగాలలో మహిళలు పురుషులతో సమానంగా ఉన్నత విజయాలు సాధిస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇళ్ల పట్టాలను మహిళల పేరునే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మహిళల సంరక్షణకు అనేక చట్టాలు వచ్చాయని, వారిపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన చేకూర్చుకునేందుకు షియో ఆటోలను, ద్విచక్ర వాహనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సంపాదనలో పురుషులతో సమానంగా మహిళలు ఉన్నారని మంత్రి తెలిపారు. మహిళల భద్రత కు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళల భద్రత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శక్తి యాప్ ను ప్రారంభిస్తున్నారని మంత్రి అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని తెలిపారు.ఆన్లైన్ అమ్మకాల్లో రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలు లింకా బుక్ ఆఫ్ రికార్డ్ సాధించబోతుందని ఇన్చార్జి మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఇంత పెద్ద స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక జరుపుకోవడం శుభ పరిణామం అన్నారు. మహిళలు ఆర్థికంగా సామాజికంగా ఉన్నత స్థితికి చేరేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. మహిళల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపడుతుందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల ద్వారా ప్రతి ఒక్క మహిళ ఆర్థికంగా స్థిరపడాలన్నారు. మహిళలకు అనేక పథకాలను అందజేయడం జరుగుతుందని అదేవిధంగా బ్యాంకు లింకేజీ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన డిఆర్డిఎ ద్వారా ద్వారా 153 సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు, మెప్మా ద్వారా1469 సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల మహిళలకు నేడు ఆస్తులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా లో రేపిడో ద్వారా 200 మహిళలు ఉపాధి కల్పిస్తున్నామని, మహిళలకు సెక్యూరిటీ పరంగా మరియు సేఫ్టీ పరంగా ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు.

భీమిలిపట్నం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళ లేకుండా రోజు పూర్తి కాదని, పురాణాలు, చరిత్ర లో మహిళకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎంతో మంది మహిళలు సమాజంలో ఆదర్శవంతంగా ఉన్నారని, మహిళకు అన్ని రంగాలలో స్వర్గీయ ఎన్ టి రామా రావు సమాన ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.

గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్వయం సహాయక బృందాల ద్వారా మహిళలు వారి కాళ్ళ పై వారు నిలబడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు.

విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు పని చేస్తున్నారని తెలిపారు.

విశాఖ పోలీస్ కమిషనర్ శంఖ బ్రాత బాగ్చి మాట్లాడుతూ అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు పని చేస్తున్నారని, దేశ రక్షణ లో మహిళలు ముందుటున్నారన్నారు. పోలీస్ విభాగంలోను మహిళా సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారని తెలిపారు.మహిళల భద్రత కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, మహిళకు ఏ సమస్య ఉన్న నా వ్యక్తిగత నెంబర్ కు ఫోన్ చేయవచ్చుని చెప్పారు. ప్రస్తుతం ఆన్లైన్ మోసాలకు మహిళలు ఎక్కువుగా గురవుతున్నారు. మోసాలకు గురైన మహిళలు భయం వదిలి పోలీసుల వద్దకు రావాలి..మీ వ్యక్తిగత విషయాలు గోప్యంగా ఉంచి విచారణ చేస్తామని అన్నారు.మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక జాగ్రత్త తీసుకోవాలన్నారు.

ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మంత్రి ప్రారంభించారు. అనంతరం కళాకారులు, చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు చెక్కులను పంపిణీ చేశారు. తదుపరి వ్యాసరచన పోటీలు, క్రీడలు వివిధ అంశాలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను మరియు మెమెంటోలను అందజేశారు. వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న చిన్నారులకు మెమెంటోలను బహుకరించారు. అదేవిధంగా కార్యక్రమ ప్రాంగణంలో మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి పరిశీలించారు.

చివరగా సెల్ఫ్ హెల్ప్ గ్రూపులలో లబ్ధిదారులకు రాపిడో స్కూటర్లను, ఆటోలను మంత్రి పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో విశాఖ తూర్పు శాసన సభ్యులు రామకృష్ణబాబు, సహకార ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ గండి బాబ్జి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీమతి ఎం రామలక్ష్మి రాధా, మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జి చిన్నయిదేవి, విశాఖ జిల్లా సమాఖ్య అధ్యక్షులు శ్రీమతి వై గంగాభవాని, జిల్లా సమైక్య సెక్రెటరీ పి సూరమ్మ, ఇతర జిల్లా అధికారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నకిలీ ఉత్పత్తులు అమ్ముతున్న

# హెచ్‌పీ డీలర్ అరెస్ట్





**హైదరాబాద్, (విశాఖ సమాచారమ్):** హెచ్‌పీసీఎల్ విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని జీహెచ్ సన్స్ పెట్రో ప్రొడక్ట్స్ అధీకృత హెచ్‌పీసీఎల్ విక్రేత వసీమ్ ఖాన్ (31)ను అఫ్జల్ గంజ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ నాగేష్ అరెస్ట్ చేశారు. హెచ్‌పీసీఎల్ విజిలెన్స్ అధికారులు హెచ్‌పీసీఎల్ లేబుల్‌తో కూడిన నకిలీ ఉత్పత్తులను విక్రయించే దుకాణాలపై నిఘా ఉంచగా వసీమ్ ఖాన్ హెచ్‌పీసీఎల్ నుండి లైసెన్స్ పొంది అదే దుకాణంలో నకిలీ ఉత్పత్తులను విక్రయించుచున్నట్లుగా వారు కనిపెట్టి ఫిర్యాదు చేశారు. డీఎస్పీ సుధీంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు అఫ్జల్ గంజ్ పోలీసులు రైడ్ చేసి పలు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. సెక్షన్ 63, సెక్షన్ 318 (4) క్రింద కేసు నమోదు చేశారు.

# యూబీఐ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఒక వైపు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నా.. మరో వైపు అత్యాచారాలు, దాడులు పెరిగిపోవడం బాధాకరమని ఆల్ ఇండియా యూబీఐ జనరల్ సెక్రెటరీ లలితా జోషి పేర్కొన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంక్ యూనియన్ (ఏపీయూబిఏ) ఆధ్వర్యంలో శనివారం అల్లూరి సీతారామరాజు పంక్షన్ హాల్లో మహిళా సదస్సును ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా లలితా జోషీ మాట్లాడుతూ మహిళలంతా చైతన్యంతో అత్యాచారాలపై పోరాడాలని పిలుపిచ్చారు. యూబీఐ జీఎం ఎం ఎస్ షాలిని మీనన్ మాట్లాడుతూ బ్యాంకుల్లో మహిళా ఉద్యోగుల పాత్ర గణనీయంగా పెరిగిందని చెప్పారు. కాలే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ టీబీఎఫ్ ముఖ్య కార్యదర్శి బి.ఎస్.రాంబాబు , యూనియన్ నాయకులు శంకర్, రిచా గాంధీ , స్వాతి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

## డాక్టర్ కందుల ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం

## వివిధ రంగాలలో ప్రతిభావంతులైన మహిళలకు సత్కారం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం అని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ అన్నారు.

శనివారం అల్లిపురం నెరేళ్ల కోనేరు వద్ద దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అంతరిక్షంలో ఉన్న సునీతా విలియమ్స్ క్షేమంగా భూమికి తిరిగి రావాలని ప్రార్ధన చేశారు.

అనంతరం వివిధ రంగాలలో ప్రతిభావంతులైన మహిళలను ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో నేడు మహిళలు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని, ఏ సమస్యొచ్చినా ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, వాటి నివారణకు విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గతంలో ఇంటికే పరితమైన మహిళలు నేడు ఎదురులేని నారీ శక్తిగా మారారని కొనియాడారు. మహిళలు ఐక్యంగా ఉంటూ ఒకరికొకరు తోడ్పాటు అందించుకోవాలని సూచించారు.

డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ కుటుంబం, దేశాభివృద్ధి కొరకు మహిళా సాధికారత ఎంతో అవసరమని, మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడు దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

కుటుంబ అభివృద్ధి మహిళల చేతిలోనే ఉంటుందని, మహిళలకు ఆర్థికపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు.

సమాజంలో మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం కూడా అభివృద్ధి చెందుతుందని, మహిళలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ప్రభుత్వం త్వరలో తల్లికి వందనం కార్యక్రమం ద్వారా మహిళలకు అండగా నిలవనుందని చెప్పారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వెళ్తుందని పేర్కొన్నారు.

అలాగే భారత మూలాలు ఉన్న సునీతా విలియమ్స్ నాసా ద్వారా అంతరిక్షంలో కి వెళ్లి కొన్ని నెలలు కావస్తుందని అన్నారు.

ఆమె క్షేమంగా భూమికి తిరిగి రావాలని అభిలాషించారు.

జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతీ ఏడాది క్రమం తప్పకుండా డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు.

ఈ సందర్భంగా ఆయన ఎన్నో మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారని చెప్పారు.భవిష్యత్ ఆయన ఆధ్వర్యంలో మరిన్ని మంచి కార్యక్రమాలు జరగాలని ఆశించారు.

ఈ కార్యక్రమంలో 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంత లక్ష్మి, 30 వార్డు ప్రెసిడెంట్ యజ్ఞేశ్వరి, జనసేన సీనియర్ నాయకురాలు నాగలక్ష్మి, నారా అమ్మాజీ,ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి రూపా, నారా నాగేశ్వరరావు, గోపాలపట్నం క్రైమ్ ఎస్సైగోవిందమ్మ,టూ టౌన్ ఏ ఎస్సై కాంతం, టూ టౌన్ పోలీసులు, మహిళా పోలీసులు బిజెపి నాయకులు శాలివాహన్, కందుల రాజశేఖర్, జనసేన ఇంచార్జ్ లు లక్ష్మి,రూపా, 39వ వార్డు ప్రెసిడెంట్ మైలపల్లి చిన్న, 32వ వార్డు జనసేన పార్టీ యువ నాయకులు కందుల బద్రీనాథ్, కందుల కేదార్నాధ్,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


LIONS INTERNATIONAL DISTRICT 316 A
LIONS CLUB OF VISAKHAPATNAM
CLUB NO: 026579 ZONE-I REGION - III
INVITATION
FREE MEGA MULTI SPECIALITY MEDICAL HEALTH CAMP
On Sunday 9th March 2025 at 9.30 am to 2.00 pm
at Kirali English Medium School, Devarapalli
WITH THE SUPPORT OF
*V. DENTAL
* SWAASA
* LIONS CANCER HOSPITAL
* CONCERN CHARITABLE TRUST
YUVARAJ FOUNDATION
SPECIALISTS DOCTORS FOR FREE CONSULTATION:
Diabetes, Orthopedic, Cardiology, Gynaecology, Dental, General Physician
FREE Screening for Cervical Cancer & Breast Cancer
FREE ECG - LUNGS B.P - SUGAR TEST
CAMP CO-ORDINATOR:
LION DR. P. K. JOSE
9440156638
Lion P.M.G. Sankar, MJF Secretary
Lion M. Kishore Gupta President
Lion N. Koteswara Rao Treasurer


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Office (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77970.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.